# న్యూస్ వార్

తెలుగు మాసపత్రిక

సంపుటి : 15 సంచిక : 6

నవంబర్ 2024 పేజీలు : 68 వెల : 5/-

ఎడిటర్ :

**నటవ కృష్ణారావు**

సబ్ ఎడిటర్ :

**శ్రీనివాస్**

రిపోర్టర్లు :

**రాము - హైద్రాబాద్**

**పరమేష్ - రంగారెడ్డి**

**రాకేష్ - నల్లగొండ**

**మహేష్ - వరంగల్**

ఫోటోగ్రాఫర్ : **వరప్రసాద్**

Printed, Published & Owned by
**NATAVA KRISHNA RAO**
and Printed at KRISHNA PUBLICATIONS
H.No. 10-74, Main Road, Chandur (Post & Mandal), Nalgonda-508255, Telangana
Published From
KRISHNA PUBLICATIONS
H.No. 10-74, Main Road, Chandur (Post & Mandal), Nalgonda-508255, Telangana
**Editor: NATAVA KRISHNA RAO**
RNI No. APTEL/2010/32216



న్యూస్ వార్ తెలుగు మాసపత్రికకు సంబంధించిన కోర్టు వ్యవహారాలు, న్యాయ పరిష్కారాలన్నియు నల్లగొండ జిల్లా కోర్టు పరిధిలోనే పరిష్కరించుకోవలసిందిగా కోరుతున్నాము.
- ఎడిటర్


## విషయ సూచిక...




యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు 7,037 కోట్ల అదనపు రుణం | 3





లంచం కొట్టు.. జీతం పట్టు... అవినీతి పర్వం
రూ.15 లక్షలు ఇస్తేనే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు | 6





ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ
అన్ని జిల్లాల్లో జేఏసీ కమిటీలు | 11






హైదరాబాద్ లో 'ఎఫ్ డీ డీ ఐ' నాలుగో స్నాతకోత్సవ వేడుకలు
ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ హాజరు | 21

## సంపాదకీయం

# విద్యారంగంలో అభివృద్ధి...

తెలంగాణ విద్యారంగానికి దశాబ్దాలుగా పట్టిన గ్రహణం తొలగిపోతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దార్శనికతతో ఇప్పుడు విద్యారంగంలో సరికొత్త కాంతులు ప్రసరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను తెలంగాణ బిడ్డలు అందిపుచ్చుకునేందుకు అవసరమైన అన్ని మార్గాలు తెరుచుకుంటున్నాయి. వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకం, దశాబ్దాలుగా నిలిచిపోయిన ప్రమోషన్ల కల్పన, వసతిగృహ విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శ్రీకారం, విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల నియామకం, నిపుణులను తీర్చిదిద్దే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు... ఇవన్నీ తెలంగాణ విద్యా రంగంలో వస్తున్న విప్లవానికి నిదర్శనాలు.

తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్య, ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు లభించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగాఢ ఆకాంక్ష. అందుకే విద్యా శాఖను ఆయన తన దగ్గరే పెట్టుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం నుంచే విద్యావ్యవస్థ బలోపేతానికి నడుం బిగించారు. వేసవి సెలవుల్లోనే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులకు వీలుగా రూ.667.25 కోట్లను కేటాయించారు. సమైక్య రాష్ట్రంలో, ప్రత్యేక రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులందరికీ పుస్తకాలు, యూనిఫాంలు అందాయి. ఆ వెంటనే ఉపాధ్యాయుల పదోన్నతులు, నియామకాలపై ముఖ్యమంత్రి దృష్టిపెట్టారు. ప్రత్యేక రాష్ట్రంలో గత పాలకులు ఉపాధ్యాయుల పదోన్నతులపై శీతకన్ను వేశారు. పదేళ్ల పాటు కోర్టు కేసులు, ఇతర సాకులతో ఈ ప్రక్రియను అటకెక్కించారు. ఏ రంగంలోనైనా పనిచేసే వారికి గుర్తింపు, అనుభవానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే సరైన ఫలితాలు వస్తాయి. రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న న్యాయపరమైన వివాదాల పరిష్కారానికి కృషి చేశారు.

ఫలితం 20 వేల మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. ఈ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్‌లో, అత్యంత పారదర్శకంగా వివాదరహితంగా విద్యా శాఖ పూర్తి చేసింది. నియామకాలే తెలంగాణ ఉద్యమ నినాదమైనప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకం, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం వహించింది.
పదేళ్ల కేసీఆర్ పాలనలో నాలుగుసార్లు మాత్రమే టెట్ నిర్వహించి, ఒకే ఒక్క డీఎస్సీ, అదీ కేవలం 8 వేల పోస్టులతో సరిపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో పదకొండు నెలల కాలంలోనే 11,062 ఉపాధ్యాయుల నియామకం పూర్తి అయింది.

ఎక్కువ మంది డీఎస్సీకి హాజరయ్యేందుకు వీలుగా టెట్‌ను ముందుగానే నిర్వహించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనవరిలో నిర్వహించనున్న టెట్‌కు దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపిన ఫలితంగా ఇప్పుడు రాష్ట్రంలో 99 శాతం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారు, నాణ్యమైన బోధన సాగుతోంది.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతి గృహాలను వేర్వేరుగా ఉంచి, సామాజిక వర్గాల వారీగా పిల్లలను శాశ్వతంగా వేరు చేసే విధానానికి స్వస్తి చెప్పాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావన. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వంద నియోజకవర్గాల్లో 20 నుంచి 25 ఎకరాల్లో ఈ స్కూల్స్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. అన్ని వసతిగృహాలు ఒకే సముదాయంలో ఉండడంతో విద్యార్థుల మధ్య స్నేహసంబంధాలు పెరగడంతో పాటు విద్యా, క్రీడాపరమైన వికాసానికి దోహదపడుతుంది. కేజీ టూ పీజీ పేరుతో ఉద్యమ కాలం నుంచి ఊదరగొట్టిన కేసీఆర్ తన హయాంలో ఇటువంటి ఒక్క విద్యా సంస్థనూ ఏర్పాటు చేయలేదు. అందుకు భిన్నంగా హామీ ఇవ్వకపోయినా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్నారు.

ఇక, రాష్ట్ర విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఐటీసీ) మార్చివేస్తున్నారు. అలాగే అకడమిక్ కోర్సులకు పరిశ్రమల అవసరాలకు మధ్య అంతరాన్ని పూడ్చడమే లక్ష్యంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా పారిశ్రామిక రంగంలో సరికొత్త ఆలోచనలు ఉన్న పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి ఈ క్రతువులో భాగస్వాములను చేశారు. పరిశ్రమల్లోని సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులకు నూతన కోర్సులను ఈ ఐటీసీలు, స్కిల్ యూనివర్సిటీ అందజేస్తాయి. వీటిల్లో శిక్షణ పొందే విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోనున్నారు.

విద్య, పరిశోధనలకు నిలయాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలను గత ప్రభుత్వం రాజకీయ క్రీడలకు వేదికలుగా మార్చివేసింది. పోలీసుల పహారాతో జైళ్లుగా తయారు చేసింది. అందుకు భిన్నంగా, రాజకీయాల ప్రమేయం లేకుండా ప్రతిభకు పట్టం కడుతూ వైస్ ఛాన్సలర్ల నియామకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి చేశారు. విశ్వవిద్యాలయాల ప్రతిష్టను పెంచి, వాటికి పూర్వవైభవం తీసుకురావాలని వైస్ ఛాన్సలర్లతో భేటీ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**- ఎడిటర్**

# యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు 7,037 కోట్ల అదనపు రుణం

## ప్రభుత్వానికి జెన్‌కో ప్రతిపాదన.. మంత్రివర్గం ఆమోదం.. త్వరలో ఉత్తర్వులు



హైదరాబాద్, : యాదాద్రి థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం(వైటీపీఎస్) నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెరగడంతో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) నుంచి రూ.7,037 కోట్ల అదనపు రుణం తీసుకునేందుకు జెన్‌కోకు మార్గం సుగమమైంది. అదనపు రుణం కోసం జెన్‌కో చేసిన ప్రతిపాదనను శనివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇందుకు సంబంధించిన జీవో త్వరలోనే వెలువడనుంది. ఆ జీవో ఆధారంగా పీఎఫ్‌సీ నుంచి జెన్‌కో రుణం పొందనుంది.

రూ.25,099 కోట్ల అంచనా వ్యయంతో నల్లగొండ జిల్లా దామరచర్లలో 2015-16లో తెలంగాణ జెన్‌కో 4,000 మెగా వాట్ల సామర్థ్యం ఉన్న వైటీపీఎస్ నిర్మాణాన్ని ప్రారంభించింది. అయితే, ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం క్రమంగా పెరుగుతోంది. తొలుత రూ.29,965 కోట్లకు, అనంతరం రూ.34,543 కోట్లకు ప్రస్తుతం రూ.36,131 కోట్లకు నిర్మాణ అంచనా వ్యయాన్ని సవరిస్తూ ప్రభుత్వానికి జెన్‌కో ప్రతిపాదనలు పంపించింది. విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు, కాలుష్యాన్ని తగ్గించడానికి ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ) అనే సాంకేతికతతో అదనపు పనులు చేపట్టాలని కేంద్రం మార్గదర్శకాలు జారీ చేయడంతో వైటీపీఎస్ నిర్మాణ వ్యయాన్ని తొలిసారి సవరించారు. అనంతరం నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, పెట్టుబడి రుణాలపై వడ్డీల భారం పెరుగుతుండడంతో మరో రెండుసార్లు అంచనా వ్యయాన్ని సవరించారు.

**మండనున్న విద్యుత్ ధరలు** యాదాద్రి విద్యుత్ కేంద్రంలో ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు యూనిట్లను నిర్మిస్తున్నారు. ప్రస్తుతమున్న సమాచారం మేరకు నవంబరులో రెండు, డిసెంబరులో ఒక యూనిట్ కలిపి 2,400 మెగా వాట్ల ప్లాంట్ అందుబాటులోకి రానుంది. అయితే, నిర్మాణ వ్యయం భారీగా పెరగడంతో ఈ ప్లాంట్ల నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్ ధరలు భారం కానున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వివిధ ప్లాంట్ల నుంచి సగటును రూ.4.92కు యూనిట్ విద్యుత్ కొనుగోలు చేస్తున్నారు. యాదాద్రి ప్లాంట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్ ధర యూనిట్‌కు రూ.8.50 వరకు ఉండే అవకాశం ఉంది.

# పకడ్బందీగా కుటుంబ సర్వేచేపట్టాలి

## సర్వేతో ఆర్థిక, విద్య, ఉపాధి అవకాశాలు

## కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




భువనగిరి : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుం బ సర్వేను విజయవంతంగా నిర్వహిం చాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇంటిం టి కుటుంబ సర్వేపై మంగళవారం ఆయన మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, ఉన్నతా ధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ విధి విధానాలను కేబినెట్ సమావేశాల్లో చర్చించి ఆమోదించామని, ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల వివరాలను సర్వే ద్వారా సేకరిస్తామని అన్నారు. అందుకు అవసరమైన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను గుర్తించి అవసరమైన శిక్షణ ఇచ్చి గ్రామం, మండలం, జిల్లాస్థాయి ప్రభుత్వాధికారులను ఎంపిక చేయాలని సూచించారు. సీఆర్‌పీ, గెస్ట్ టీచర్ల సేవలు వినియోగించుకోవచ్చునని సూచించారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ ఉండేలా చూడాలని చెప్పారు. సర్వే నిర్వహణకు ప్రతీ మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలన్నారు. సర్వే షెడ్యుల్ వివరాలు ప్రజలకు చేరేలా ప్రచారం నిర్వహించి, వచ్చే నెల 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

**అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి**

బలహీన వర్గాలు, అట్టడుగు పేద ప్రజలందరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలపాలన్నారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గంగాధర్, జి.వీరారెడ్డి, జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి, ఎల్.యశోద, డీఎఫ్‌వో పద్మజరాణి, జిల్లా రవాణా అధికారి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ అరెస్ట్..

- నకిలీ రిజిస్ట్రేషన్ కేసులో 14 రోజుల రిమాండ్
- తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రంతో భూ రిజిస్ట్రేషన్
- యజమాని బతికుండగానే మరొకరికి బదలాయింపు



జీడిమెట్ల, : నకిలీ రిజిస్ట్రేషన్ కేసులో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన వుజ్జిని జ్యోతిని జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మేడ్చల్ జడ్జి ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించారు. హైదరాబాద్‌లోని ఉప్పుగూడ ప్రాంతంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన లెంద్యాల సురేశ్‌కు జీడిమెట్ల పోలీసస్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్ వెంకటాద్రినగర్‌లో 200 గజాల స్థలం ఉంది. ఆ స్థలం ఖాళీగా ఉండటంతో స్థానిక బీఆర్ఎస్ నేత పద్మజారెడ్డి మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి స్థల యజమాని బతికుండ గానే మృతి చెందినట్టు మరణ ధ్రువీకరణ పత్రం, నకిలీ పాన్‌కార్డు, ఆధార్ కార్డులను సృష్టించారు. 2023 ఫిబ్రవరిలో అప్పటి కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న జ్యోతి ఆ స్థలాన్ని పద్మా జారెడ్డి పేరుమీద రిజిస్ట్రేషన్ చేశారు. దీనికి సంబం ధించిన ఫిర్యాదు అందడంతో ఈ నెల 4న పద్మాజారెడ్డితో పాటు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

విచారణ నిమిత్తం తిరిగి పద్మాజారెడ్డిని అదుపులోకి తీసుకున్న జీడిమెట్ల పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. తనకు సబ్ రిజిస్ట్రార్ జ్యోతితో పాటు మరి కొందరు వ్యక్తులు ఈ నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్‌కు సహకరించినట్టు ఆమె వెల్లడించడంతో.. ప్రస్తుతం నాంపల్లిలోని చిట్స్ అండ్ ఫైనాన్స్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న జ్యోతిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ తెలిపారు. అదేవిధంగా ఈ నకిలీ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన మరికొందరు ప్రజాప్రతినిధులపై కూడా విచారణ చేయడానికి పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు.

# రుణాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

## ఇందిరా మహిళా శక్తి మిషన్ కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్

భువనగిరి : బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలని ఇందిరా మహిళా శక్తి మిషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రసన్నకుమార్ అన్నారు.

మహిళా శక్తిరుణాలతో భువనగిరిలో మహిళా సంఘా లు ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, మహిళా క్యాంటీన్‌ను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బ్యాంక్ రుణాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించరాదని, వ్యాపార అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణం గా వ్యాపారాలను ఎంచుకోవాలన్నారు. రుణ వాయిదాలను సక్రమంగా చెల్లిస్తే రుణ పరపతి పెరుగుతుందని గ్రహించాలన్నారు. మునిసిపల్ రుణ వ్యవస్థను ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పి.రామాంజుల్‌రెడ్డి, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రమే ష్, మెప్మా అధికారులు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# లంచం కొట్టు.. జీతం పట్టు... అవినీతి పర్వం

- రూ.15 లక్షలు ఇస్తేనే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు
- కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏవో, జూనియర్ అసిస్టెంట్ డిమాండ్
- ఏసీబీకి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఫిర్యాదు.. నిందితులను పట్టుకున్న అధికారులు



కొత్తగూడెం : అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాల చెల్లింపు కోసం లంచం తీసుకుంటూ భద్రాద్రి జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో సదరు ఏజెన్సీ యాజమాన్యం మెడికల్ కళాశాలను, జిల్లా ఉన్నతాధికారులను సంప్రదిం చింది. దీంతో ఏవో రెండున్నర నెలల జీతాల బిల్లులను మంజూరు చేశారు. అయితే, సరైన ధ్రువపత్రాలు లేవంటూ 23 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించగా వారికి కూడా పని చేసిన కాలానికి జీతాలివ్వాలని ఆ ఏజెన్సీ కోరింది. దీంతో మొత్తం 49 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించేం దుకు రూ.15 లక్షలు లంచం ఇవ్వాలని ఏవో, జూనియర్ అసిస్టెంట్ డిమాండ్ చేశారు. రూ.7 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్న ఆ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ యాజమాన్యం ఏసీబీని ఆశ్రయించింది.

ఏబీసీ అధికారుల సూచన మేరకు.. ఆ ఏజెన్సీ వారు రూ.3 లక్షలను మెడికల్ కళాశాల ఏవో ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్‌లకు ఇవ్వగా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తెలిపారు

# పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

జగిత్యాల :పోలీసు అమరవీరుల త్యాగాలులు వెలకట్టలేనివని జగిత్యాల జిల్లా అశోక్ కుమార్ అన్నారు. పోలీసు అమరవీరులు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో జిల్లా పోలీస్ శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 50 యూనిట్ల రక్తాన్ని పోలీస్ అధికారులు, యువకులు దానం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులు సమాజం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్ కోసం ప్రాణాలు త్యాగం చేశారన్నారు. అమరుల త్యాగాల ఫలితమే ఈ రోజు దేశంలోని ప్రజలంతా శాంతియుత వాతావరణంలో ప్రశాతంగా ఉంటున్నారన్నారు. ప్రతి వ్యక్తి మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేసినపుడే అమరుల త్యాగాలకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రది ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘు చందర్, టౌన్ సీఐ వేణు గోపాల్, ఆర్ఐ వేణు, ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ సెక్రటరీ, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు మంచాల కృష్ణ. సిరిసిల్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# లాంజ్ యాప్‌తో లూటీ..

## వెలుగులోకి సరికొత్త సైబర్ నేరం - రెండు నెలల్లో రూ.9 లక్షలు కాజేత




హైదరాబాద్ : సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో మోసాలకు పాల్పడుతున్నారు. ఎయిర్‌పోర్టులో ప్రయాణికులను టార్గెట్ చేసి 'లాంజ్ యాప్' ద్వారా డబ్బు కాజేస్తున్న సంఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఎయిర్‌పోర్ట్‌లో వినియోగించే లాంజ్ యాప్‌లో సైబర్ నేరగాళ్లు మాల్‌వేర్‌ను ప్రవేశపెట్టారు. తద్వారా సేకరించిన సమాచారంతో బ్యాంకు ఖాతాల నుంచి డబ్బును కాజేస్తున్నారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో నకిలీ లాంజ్ యాప్ ద్వారా 450 మంది ప్రయాణికుల నుంచి సుమారు రూ. 9 లక్షలు కాజేసినట్లు థ్రెట్ రీసెర్చ్ టీమ్ నివేదికలో వెల్లడయింది.

ఈ యాప్ ప్రమాదకరమని సదరు సంస్థ హెచ్చరించింది. ఈ తరహా మోసంలో డబ్బు పోగొట్టుకున్న బాధితురాలు పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయింది. బెంగళూరు విమానాశ్రయం లో ఓ ప్రయాణికురాలు విమానం బయలుదేరేందుకు సమయం ఉండటంతో లాంజ్‌కు వెళ్లింది. సిబ్బంది సూచన మేరకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసింది. వచ్చిన లింక్ ద్వారా 'లాంజ్ యాప'ను ఇన్‌స్టాల్ చేసుకుంది. యాప్ ఇన్‌స్టాల్ చేసే సమయంలో వ్యక్తిగత వివరాలతోపాటు సెక్యూరిటీ ఫీచర్ల పేరుతో ఫేస్ స్క్రీనింగ్ కూడా చేసింది.

యాప్‌లో మొబైల్ స్క్రీన్ షేరింగ్ చేస్తున్నట్లు గుర్తించినా, పని ఒత్తిడి, తొందరపాటులో ఈ విషయం గురించి పట్టించుకోలేదు. కొద్ది రోజుల తర్వాత ఆమెకు ఫోన్‌లు, మెసేజ్‌లు రాకపోవడంతో నెట్‌వర్క్ సమస్య అని భావించింది. ఆమెకు ఫోన్ చేసిన స్నేహితులు, వేరే వ్యక్తి ఫోన్ రిసీవ్ చేసుకుంటున్నాడని చెప్పినా పని వత్తిడి, కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాల వల్ల ఈ విషయంపై దృష్టి సారించలేదు.

తన క్రెడిట్ కార్డు నుంచి రూ. 87,123 వేరే ఖాతాకు బదిలీ అయ్యాయని సందేశం రావడంతో అప్రమత్తమైంది. వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించి క్రెడిట్ కార్డును బ్లాక్ చేయించింది. ఈ మోసానికి 'లాంజ్ యాప్' కారణమని గుర్తించింది. యాప్ ద్వారా మొబైల్‌లో సెట్టింగ్స్ మార్చిన సైబర్ నేరగాళ్లు తనకు రావాల్సిన ఫోన్‌లు, మెసేజ్‌లు, ఓటీపీలు సేకరించి డబ్బు కాజేశారని పేర్కొంది. యాపిల్ ఫోన్ వినియోగిస్తున్నా రక్షణ లేకుండా పోయిందని బాధితురాలు వాపోయింది.

**మోసాలు ఇలా..** విమానాశ్రయాల్లో ప్రయాణికులు సాధారణంగా లాంజ్‌లను ఆశ్రయిస్తారు. ఇదే అదునుగా భావించిన సైబర్ నేరగాళ్లు 'లాంజ్ యాప'లో లాంగ్ ఈపాసడాట్ ఇన్ వంటి అప్లికేషన్‌లను జొప్పించారు. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారి మొబైల్‌లోని సమాచారాన్ని సైబర్ నేరగాళ్లకు చేరవేస్తుంది. మొబైల్‌లో ఉన్న బ్యాంకు ఖాతా వివరాలు సేకరించడమే కాకుండా మొబైల్‌కు వచ్చే సందేశాలు, ఓటీపీలను నియంత్రిస్తుంది. నేరగాళ్లు బ్యాంకులో నగదు బదిలీ సందర్భంగా వచ్చే ఓటీపీలు కూడా తమకే వచ్చేలా మొబైల్ సెట్టింగ్స్ మార్చుతున్నారు.

మొబైల్‌ను అధీనంలోకి తీసుకుని కాల్ ఫార్వార్డింగ్ ఆప్షన్‌లో తమ నంబర్‌లు పెట్టడం ద్వారా ఫోన్‌లు, సందేశాలు, ఓటీపీలు వారికే వెళ్లేలా చేసుకుంటున్నారు. బ్యాంకు ఖాతా, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు తెలుసుకొని, ఓటీపీల సాయంతో డబ్బులు కాజేస్తున్నారు. దీనిపై దృష్టి సారించిన సైబర్ నిపుణులు రివర్స్ ఇంజనీరింగ్ చేసి ఈ యాప్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేస్తున్నారో గ్రహించారు. లాంజ్ యాప్ మాత్రమే కాకుండా కొత్త అప్లికేషన్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ల ద్వారా సేకరించిన సమాచారం దుర్వినియోగం అయ్యే అవకాశముందన్నారు.

# చీకటి వెలుగుల రంగేళి.... జీవితమే ఓ దీపావళి



ఆశ్వయుజ బహుళ అమావాస్యనాడు వచ్చేది దీపావళి. ధన త్రయోదశి నాడు బంగారం కొనడం, చతుర్ధశి నాడు మంగళ హారతులు, దీపావళి నాడు ధనలక్ష్మి పూజలు చేస్తారు. ఈ యేడు గురువారం మధ్యాహ్నం చతుర్దశి ఉంటూ 2 గంటల నుంచి అమావాస్య వస్తోంది. గురువారమే దీపావళి పండుగ, ధనలక్ష్మి పూజలు జరుపుకోనున్నారు. శుక్రవారం స్వాతి నక్షత్రంతో కూడిన అమావాస్య ఉండడంతో నోములు నోచుకోనున్నారు. వ్యాపార గృహ సముదాయాల్లో పూజల అనంతరం టపాసులు కాలుస్తారు.

ప్రతి ఇల్లు కొత్త అల్లుళ్లలతో సందడిగా మారగా ఇంటిల్లిపాది పిండి వంటలు తింటూ కబుర్లతో కాలక్షేపం చేస్తారు. పడిపోయిన, కొత్తవి, పంచకునే నోములు శుక్రవారం ఆచరించవచ్చని పండితులు చెబుతున్నారు.

**దీపావళి పండగ వెనుక ఇతిహాసం..** ద్వాపర యుగంలో ప్రాగ్జోతిష్యపురం రాజధానిగా నరకాసురుడు పరిపాలన చేస్తూ దేవ, మావన జాతిని ఇబ్బందులకు గురి చేసేవాడు. ధర్మానికి భంగం కలిగించే పనులకు సహించని భూమాత, దేవతలు, ప్రజలు, శ్రీకృష్ణుడికి విన్నవించు కుంటారు. కృష్ణుడు సత్యభామతో కలిసి ఆశ్వయుజ చతుర్ధశి నాడు నరకుడిని అంతం చేస్తారు. అది నరక చతుర్ధశి. నరకాసుర వధానంతరం వచ్చిన సత్యభామ కృష్ణులకు అమావాస్య (చీకటి రోజు) నాడు ప్రజలు దీపాలను వెలిగించి మంగళహారతులు, భాజాభజంత్రీలుతో స్వాగతం పలుకుతారు. ఆనాటి నుంచి దీపావళిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

**దీపాల వెలుగులు- టపాసుల మోతలు..** దీపావళి అనగానే వివిధ ఆకృతుల్లో ఉన్న ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తారు. వరుసలుగా దీపాలు వెలిగించి ఆ కాంతుల మధ్య వెలిగి పోతున్న గృహాలను చూసుకొని మురిసి పోతారు. అమావాస్య తిథి లక్ష్మీదేవికి ఇష్టం కావడంతో దీపాలు వెలిగించి అమ్మ వారికి పూజలు చేసి ఆహ్వానిస్తే ధనలక్ష్మి కృప ఉంటుందని విశ్వాసం.పూజల అనంతరంవివిధ రకాల టపాసులను, బాంబులను చిన్నా పెద్ద తేడా లేకుండా కాల్చి ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకుంటారు.

**దీపావళిని ఇలా జరుపుకోవాలి..** గురువారం మధ్యాహ్నం వరకు చతుర్ధశి తిథి ఉన్నందున దేవుని వద్ద మంగళ హారతి వెలిగించాలి. ఆడపడచులు హారతులిచ్చి దిష్టి తీయగానే తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి లక్ష్మీపూజ చేసి నైవేద్యం సమర్పించాలి. అమావాస్య తిథి గురువారం మధ్యాహ్నం వస్తుండడంతో మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు దీపావళి పూజలు జరుపాలి. నోములు, వ్రతాలున్న వారు కేదారీశ్వర, సత్యనారాయణ స్వామి వ్రతాలు శుక్రవారం ఆచరించవచ్చు.

# దేవుళ్లపై ఒట్లు వేసి హామీలు మరిచారు : హరీష్‌రావు




వనపర్తి: అక్రమ కేసులు పెడుతూ కొందరు పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారని.. వారి పేర్లు డైరీల్లో రాసిపెడుతున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు హెచ్చరించారు. తెలంగాణలో కొత్తపథకాలు అటుంచి పాత పథకాలను కూడా సీఎం రేవంతరెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే సోయి రేవంత్ ప్రభుత్వానికి లేదని హరీష్‌రావు విమర్శించారు.

**రుణమాఫీకి ఎగనామం..** తెలంగాణలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని అన్నారు. అనేక కొర్రీలు పెట్టి రేవంత్ ప్రభుత్వం రుణమాఫీకి ఎగనామం పెడుతోందని మండిపడ్డారు.

వనపర్తిలో హరీష్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ... దేవుళ్లపై ఒట్లు వేసి హామీలు మరిచారని మండిపడ్డారు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టిన పాలకుడు.. ఇచ్చిన మాట తప్పితే తెలంగాణకే అరిష్టమని అన్నారు. ఎనముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగ వేతల రేవంత్ రెడ్డి అని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు వదిలిపెట్టమని హెచ్చరించారు. ఢిల్లీకి మూటలు పంపేందుకు..లక్షా 50 వేల కోట్ల రూపాయలతో మూసీ సుందరీకరణకు డబ్బులిచ్చే సీఎం రేవంత్‌రెడ్డికు రైతులకు రైతుభరోసా ఇచ్చేందుకు నిధులు లేవా అని హరీష్‌రావు నిలదీశారు.

**నిరుద్యోగులకు తీవ్ర నష్టం..** రైతుబంధు ఇవ్వని కాంగ్రెస్ పార్టీని ఉరికించాలని హరీష్‌రావు హెచ్చరించారు. పత్తిరైతులకు మద్దతు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డెడ్‌లైన్లు మారాయి.. పత్రికల్లో హెడ్‌లైన్లు మారాయి..కానీ రైతు రుణమాఫీ మాత్రం ఓ లైనుకు రాలేదని విమర్శించారు. సర్కార్ ధవఖానాల్లో మందులు కూడా లేవని చెప్పారు. జీఓ నెంబర్29తో నిరుపేద నిరుద్యోగులకు తీవ్ర నష్ట కలుగుతోందని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ప్రజాపాలన కాదు..పోలీసు పాలన సాగుతోందని హరీష్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్‌కు పాలన మీద పట్టు లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదన్నారు. బీఆర్ఎస్ పోరాటంతోనే తెలంగానలో కరెంట్ బిల్లులు పెరగలేదని చెప్పారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రేవంత్ ప్రభుత్వం మెడలు వంచుతామని హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల బాకీ పడిందని అన్నారు. పోరాటాలతోనే సమస్యల పరిష్కారం జరుగుతుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు.

# వెలుగులోకి మరో స్కామ్.. ఏసీబీకి మున్సిపల్ శాఖ ఫిర్యాదు




హైదరాబాద్, : పార్ములా ఈ కార్ రేస్ నిర్వహణకు సంబంధించి నిధుల గోల్‌మాల్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కోసం జరిపిన కేటాయింపులపై ఏసీబీకి మున్సిపల్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని మున్సిపల్ శాఖ కోరింది. కోట్లల్లో నిధులు బదిలీలు జరగడంపై మున్సిపల్ శాఖ విచారణ కోరింది. నిబంధనలు పాటించకుండా ఎమ్ఏయూడీ నిర్వహణ సంస్థ ఎఫ్ఈఓకు రూ. 55కోట్ల చెల్లింపులు జరిగాయి. ఒప్పందంలో పేర్కొన్న అంశాలు పాటించకపోవడంతో ఫార్ములా ఈ రేసింగ్ సెషన్ -10 రద్దు అయ్యింది. బోర్డు, ఆర్థికశాఖ నుంచి ముందస్తు అనుమతి లేకుండానే రూ.55 కోట్లు విదేశీ సంస్థకు నిధుల చెల్లింపులు జరిగాయి.

కాగా.. గత ఏడాది ఫిబ్రవరి-11న హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్ చుట్టూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 2.8 కి.మీ. ట్రాక్‌లో మొదటి ఫార్ములా-ఈ కార్ల పోటీ జరిగింది. సీజన్-9 ఫార్ములా-ఈ రేస్ నిర్వహణకు రూ.200 కోట్లు ఖర్చయింది. ఇందులో ఈవెంట్ నిర్వాహక సంస్థలైన గ్రీన్‌కో రూ.150కోట్లు, హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్ రూ.30 కోట్లు ఖర్చుచేశాయి. రహదారులు, ఇతర మౌలిక వసతులకు హెచ్ఎండీఏ రూ.20 కోట్లు ఖర్చు చేసింది. ఇది విజయవంతం కావడంతో 2024 ఫిబ్రవరి 10న మరోసారి (సెషన్-10) నిర్వహించేందుకు ఫార్ములా-ఈ ఆపరేషన్(ఎఫ్ఈవో)తో ఎంఏయూడీ 2023 అక్టోబరులో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు హెచ్ఎండీఏ రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు చెల్లించింది.

ఈ ఈవెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా ఉండి.. ఖర్చంతా ప్రైవేటు సంస్థలైన గ్రీన్కో ఫార్ములా-ఈనే భరించాల్సి ఉంది. కానీ.. గత సీజన్‌లో ప్రధాన భాగస్వామిగా ఉన్న గ్రీన్కో సంస్థను తొలగించి దానిస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండేలా సీనియర్ ఐఏఎస్ ఒకరు సొంత నిర్ణయం తీసుకున్నారు. ఆ సమయంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. అటు ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా, ఎన్నికల సంఘం అనుమతి తీసుకోకుండా, కనీసం ఆర్థికశాఖ దృష్టికి తీసుకెళ్లకుండానే ఆ ఉన్నతాధికారి ఈవెంట్ నిర్వహణకు హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు ముందస్తు చెల్లింపులు చేశారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఒప్పందంలో పేర్కొన్న అంశాలను పాటించకపోవడంతో తాము హైదరాబాద్ రేస్ నుంచి తప్పుకొంటున్నట్లు అదే నెలలో ఎఫ్ఈవో ప్రకటించింది. అనంతరం 'సెషన్-10' రద్దయింది. ఫిబ్రవరి 10న ఈవెంట్ జరిగి ఉంటే హెచ్ఎండీఏపై రూ.200 కోట్ల భారం పడేది. కానీ, ఇంతలో విషయం బయటపడడంతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఫార్ములా-ఈ రేసుపై చట్టవిరుద్ధంగా నిర్ణయం తీసుకున్న అధికారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోటీసులు కూడా జారీ చేశారు. ఇదిలాఉండగా.. ఈ రేసింగ్‌లో నిధుల గోల్‌మాల్ అంశంపై విచారణకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ఏసీబీ లేఖ రాసింది. మరి ప్రభుత్వం ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

## అన్ని జిల్లాల్లో జేఏసీ కమిటీలు

## టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్



సంగారెడ్డి : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామని సీఎం హామీ ఇచ్చారని, ఆర్థిక అంశాలు కాకుండా మిగిలిన సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తామన్నారని టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ తెలిపారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల 206 ఉద్యోగ సంఘాలను కలిపి జేఏసీగా ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించిన క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పిలిచి సుమారు మూడు గంటలపాటు చర్చలు జరిపారన్నారు.

రెండు, మూడు వారాల్లో పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని.. ఉద్యోగులు సంయమనం పాటించాలని సీఎం చెప్పినట్లు ఆయన వివరించారు. ఈ-కుబేర్‌ను రద్దు చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ దీపావళికి ఒక డీఏ ఇస్తామని, మిగతా రెండు డీఏలు మార్చిలో ఇస్తామన్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో జేఏసీ కమిటీలు ఏర్పాటు చేసి ఉద్యోగులను ఏకం చేస్తామన్నారు. రెవెన్యూలోని వీఆర్‌వోలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారని, దీంతో 5 వేల పోస్టులు ఖాళీ అయ్యాయని, ఫలితంగా కారుణ్య నియామకాలు కూడా ఆగాయనే విషయం సీఎంకు వివరించామని వాటన్నిటికి త్వరలో పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నామన్నారు.

ఉద్యోగులందరూ సక్రమంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉద్యోగులకు ఏ పార్టీతో సంబంధం లేదని, రాజకీయాలు అవసరం లేదని స్పష్టం చేశారు. 317 జీవోపై గతంలో జిల్లాలు, జోన్‌ల విభజనలో అభ్యంతరాలు తెలిపినా గత సర్కారు పెడచెవిన పెట్టడంతో ప్రస్తుతం ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. టీఎన్‌జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ముజీబ్ మాట్లాడారు.

# 8 కి.మీ.కు ఒక ఆరోగ్య కేంద్రం : మంత్రి దామోదర రాజనర్సింహ

రేగోడు, : అందరికీ వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రతి 8 కి.మీ.కు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మెదక్ జిల్లాలో రూ.7 కోట్లతో మంజూరైన బోరంచ నల్లపోచమ్మ ఎత్తిపోతల పథకం అదనపు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే రేగోడు-మర్పల్లి, చౌదర్పల్లి- కొత్వాల్‌పల్లి చెరువులకు సింగూర్ జలాలను కాలువల ద్వారా నింపే పనులను ప్రారంభించారు.

అనంతరం మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని, మిగిలిన వారికి త్వరలోనే రుణమాఫీ చేస్తామని తెలిపారు.

ఇల్లు లేని నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని చెప్పారు. అందోల్ నారాయణ ఖేడ్ మధ్యలో రేగోడు మండలంలో ఐటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

# స్కిల్స్ వర్సిటీ భవనాల డిజైన్లు ఖరారు

## నవంబరు 6 నుంచి నిర్మాణ పనులు... 10 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం

## భవనాల నిర్మాణం బాధ్యత మేఘాకే




హైదరాబాద్, : యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణాల డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో వర్సిటీ నిర్మాణం చేపట్టనున్నారు. నవంబర్ 6వ తేదీన పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పది నెలల్లోగా ఈ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. యునివర్సిటీ క్యాంప్‌సలో అన్ని భవనాల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి బాధ్యతలను మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) తీసుకుంది. గత శనివారం ఈ మేరకు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందం కూడా చేసుకుంది. భవన నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లను ఎంఈఐఎల్ అందించగా.. వాటినే ప్రభుత్వం ఖరారు చేసింది.

ఐదంతస్తుల్లో పరిపాలన భవనం చేపట్టనున్నారు. హాస్టళ్లు, స్టాఫ్ క్వార్టర్లు, ఆడిటోరియం, లైబ్రరీ, సువిశాల మైదానం, పార్కింగ్ ఏరియా ఉండేలా ఈ డిజైన్లు రూపొందించారు. సువిశాల ప్రాంగణంలో ఎక్కువ ఖాళీ స్థలం ఉండేలా భవన నమూనాలు తయారు చేయించారు.

ఆరు వేల మంది విద్యార్థుల నైపుణ్య శిక్షణ, వసతి సదుపాయాలు ఉండేలా క్యాంప్‌సలో నిర్మాణాలను చేపడతారు. అన్ని భవనాలపై సౌర విద్యుత్తు ప్యానెళ్లను అమర్చనున్నారు. ఏసీల వాడకం లేకుండా కొన్ని భవనాల్లో సహజమైన గాలి వెలుతురు ఉండేలా అధునాతన డిజైన్లలో భవనాలు నిర్మించనున్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలుండేలా వర్సిటీ క్యాంప్‌సను నిర్మించాలని నిర్మాణ బాధ్యతలు చేపట్టిన మేఘా కంపెనీ ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. స్కిల్స్ వర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించగా.. అదానీ గ్రూప్ రూ.100 కోట్లు విరాళంగా అందించింది. భవనాల నిర్మాణానికి కావాల్సిన రూ. 200 కోట్లను మేఘా కంపెనీ అందించనుంది.

# యాదాద్రి జిల్లా నూతన కలెక్టర్‌గా హనుమంతరావు

## పర్యాటక శాఖ డైరెక్టర్‌గా హనుమంతు కే.జెండగే బదిలీ



యాదాద్రి, : సమాచార, పౌరసంబంధాల, దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న హనుమంతరావు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇంతకుముందు కలెక్టర్ హనుమంతు కె. జెండగే బదిలీ అయ్యారు. హను మంతరావు బాధ్యతలు స్వీకరించారు.

హనుమంతు కే.జెండగేను పర్యాటక శాఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. జెండగే జిల్లాలో సంవత్సరం కాలంగా పనిచేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషనర్ ఆదేశాలమేరకు ఆయన కలెక్టర్‌గా ఇక్కడికి బదిలీపై వచ్చారు. కలెక్టర్‌గా, జిల్లా ఎన్నికల అధికారిగా శాసనసభ, లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించారు.

**అదనపు కలెక్టర్‌గా జి.వీరారెడ్డి** : అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.బెన్‌షాలోం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హెచ్‌ఎండీఏలో ఎస్టేట్ ఆఫీసర్‌గా చేస్తున్న జి.వీరారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బెనషాలోమ్‌ను నారాయణపేట్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ చేశారు. వీరారెడ్డి గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బాధ్యతలు నిర్వర్తించి, ఎన్నికల సమంలో బదిలీ అయ్యారు. అదేవిధంగా భువనగిరి రెవెన్యూ డివిజన్ అధికారి ఎస్.అమరేంద్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి సంక్షేమ అధికారిగా పనిచేస్తున్న కృష్ణారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అమరేందర్‌ను నల్లగొండ జిల్లా డీఆర్వోగా బదిలీ చేసింది.

# గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధికి చేయూత

## టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

చౌటుప్పల్ : గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధికి ప్రభుత్వం చేయూత ఇస్తుందని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో కొత్తగా ఏర్పాటుచేసిన ఎన్విరోఫ్లూయిడ్స్ పరిశ్రమను ఆమె ప్రారంభించారు.

అనంతరం ఇక్కడి పలు పరిశ్రమలను సందర్శించారు. పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇక్కడి పార్కు విశేషాలను తెలంగాణ ఇండస్ట్రియల్ వెల్ఫేర్ (టీఫ్) అధ్యక్షుడు సుదీర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయానని అన్నారు. పార్కు అభివృద్ధికి శ్రమించిన టీఫ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇక్కడి పరిశ్రమలకు కావాల్సిన నీటి సరఫరా, 132కేవీ సబ్‌స్టేషన్, రవాణా సౌకర్యం, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప వంటి అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీఫ్ కార్యదర్శి గోపాల్‌రావు, జోనల్ మేనేజర్ సంతోష్, గోవిందరెడ్డి, స్వామిగౌడ్, యాదయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, ఎన్విరో ఫ్లూయిడ్స్ సంస్థ ఎండీ రవినాయక్, పాల్గొన్నారు.

# పంట నష్టపరిహారం అందించేందుకు కృషి

## ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



హాలియా, : అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనుముల మండలం మదారిగూడెం గ్రామంలో వర్షంతో నేలవాలిన పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేయగా, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఏవో సరిత, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కుందూరు వెంకట్‌రెడ్డి, పోషం శ్రీనివాసగౌడ్, రిక్కల కరుణాకర్‌రెడ్డి, రిక్కల వెంకట్‌రెడ్డి, నకిరేకంటి సైదులు, శోభన్‌బాబు, సర్వర్, ఇబ్రహీం, చెన్ను వెంకట్‌రెడ్డి, శేఖర్, ఫకృద్దీన్, రబ్బాని, వెంకయ్య, తదితరులు ఉన్నారు.

**గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం కృషి** : గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 100మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గీత కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులతో రూపొందించిన రక్షణ కిట్లను పంపిణీ చేస్తోందన్నారు. గతంలో రక్షణ కిట్లు లేక ప్రమాదవశాత్తు మృతి చెందిన వారు. వైకల్యానికి గురైన వారు చాలామంది గీత కార్మికులు ఉన్నారన్నారు. గత ప్రభుత్వం గీత కార్మికులను విస్మరిం చిందని విమర్శించారు. కార్యక్రమంలో అంకతి సత్యం, ఎక్సైజ్ సీఐ కల్పన, నాంపల్లి సీఐ సైదులు, నాయకులు కాకునూరి పెదనారాయణగౌడ్, భాస్కర్‌నాయక్, కృష్ణానాయక్, కాసాని చంద్రశేఖర్, రాజాప్రసాద్, పిల్లి ఆంజనేయులు, గౌని రాజారమేషయాదవ్, వెంపటి శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**అధైర్య పడవద్దు .. పరిహారం ఇప్పిస్తాం** వర్షాలతో పంట నష్టపోయిన రైతులు ఎవరూ అధైర్య పడవద్దని, ప్రతీ ఒక్కరికి పరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని గుంటుకగూడెం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. 1,370 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అ?ధికారి మునికృష్ణయ్య, ఏఈవో క్రాంతికుమార్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి, బొల్లం శ్రీనివాసయాదవ్, నూకల వెంకట్‌రెడ్డి, పగిళ్ల శివ, ఆలంపల్లి మైసయ్య, మేరెడ్డి వెంకటరమణ, ఆలంపల్లి కృష్ణ, సింగం రామలింగయ్య, మేరెడ్డి రాజిరెడ్డి, గొంగటి శ్రీనివాస్, వీరేశం, తరి నర్సింహ పాల్గొన్నారు.

# టీజీఈజేసీ కమిటీ ఏకగ్రీవం



యాదాద్రి, : తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన కమిటీ(టీజీఈజేఏసీ) నూతన కమిటీ ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లతో ఈ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో 45పంఘాల ప్రతి నిధులు ఉన్నారు. నూతన కమిటీ చైర్మనగా మందడి ఉపేందర్‌రెడ్డి (టీజీవోల సంఘం రాష్ట్ర కోశాధికారి), సెక్రటరీ జనరల్‌గా ధరణికోట భగత (టీఎనజీవోల జిల్లా అధ్యక్షుడు), అడిషనల్ సెక్రటీరీ జనరల్‌గా కుంట్ల అమరేందర్‌రెడ్డి (పీఆర్‌టీయూ టీఎస్), కో చైర్మన్లుగా ముక్కెర్ల యాదయ్య (టీఎసయూటీఎఫ్), చీకూరి జగనోమోహనప్రసాద్(టీజీవోల జిల్లా అధ్యక్షుడు), బాణాల రాంరెడ్డి(రెవెన్యూ), శ్రీకాంతరెడ్డి (పంచాయతీరాజ్), డిప్యూటీ సెక్రటరీ జనరల్ సెక్రటరీలుగా ఎండి.ఖదీర్(టీఎనజీవో), జి.శశికాంత (పంచాయతీరాజ్), పి.శ్రీకాంత (టీఆర్‌ఈఏ), అజీజ్ అలీఖాన(అగ్రికల్చర్ ఆఫీసర్స్), వైస్ చైర్మన్లుగా కల్లూరి రమేష(ఎస్టీయూ టీఎస్), నాయిని లక్ష్మీ నరిసింహారెడ్డి(డీటీఎఫ్), కేతావత రవీందర్‌నాయక్ (టీజీహెచఎంఏ), కోమటిరెడ్డి మోహనరెడ్డి (పెన్షనర్స్), పి.రవికుమార్(రెవెన్యూ), వై.శ్రీనివాసరెడ్డి (ఎంపీడీవో), పి.శ్రీనివాస(వెటర్నరీ), సెక్రటరీలుగా జి.అంబికా (ఇరిగేషన),ఎండీ.జానీ(సెర్ప్), సురేష్, సలివేరు మహేష్, (మోడల్‌స్కూల్), కె.రమేషబాబు(టాప్రా), ఫైనాన్స సెక్రటరీగా కె.కుమార్(మునిసిపల్), ఆఫీస్ సెక్రటరీలుగా సీహెచ.లక్ష్మీ(కేజీబీవీ), గడ్డం బాలస్వామి(ఎనఆర్‌ఈజీఎస), అనిల్ (ఏఈవో), ప్రచార సెక్రటరీగా శైలజ(హెచడబ్లుఓ), మహిళా ప్రతినిధి డి.కవిత(ఇరిగేష)ను ఎన్నుకున్నారు.

**ప్రభుత్వం వెంటనే డీఏను చెల్లించాలి** : ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు 2022నుంచి రావాల్సిన కరువు భత్యాలు(డీఏ)లు విడుదల చేయాలని జి ల్లా జేఏసీ చైర్మన మందడి ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక బిల్లులను విడుదల చే యాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా 51శాతం ఫిట్‌మెంట్తఓ రెండో పీఆర్సీను అమలు చేయాలని కోరారు. ఉపాధ్యా య, ఉద్యోగ, పెన్షనర్లకు ఆరోగ్యపథకాలను అమలు చేయాలని, పాత పెన్షన విధానాన్ని పునరుద్ధరించి, 317జీవోఎను సమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రభుత్వ హాస్పిటల్ లో మెరుగైన వైద్య సేవలు అందించాలి.....

## సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ని ఆకస్మికంగా తనిఖి చేసిన......

## జిల్లా కలెక్టర్ : తేజస్ నంద్ లాల్ పవార్



పేదవారికి ప్రభుత్వ హాస్పిటలలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శనివారం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకం తో ప్రభుత్వ హాస్పిటల్ కి వస్తున్నారని వారి నమ్మకాన్ని నిజం చేసేలా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ప్రభుత్వ హాస్పిటల్ లో సేవలు అందించాలని సూచించారు.

మాత శిశు సంరక్షణ కేంద్రం పరిశీలించి ప్రసవాలు రోజు వారీగా, నెల వారీగా ఎన్ని అవుతున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.మాత శిశు సంరక్షణ కేంద్రానికి వచ్చే పెషేంట్స్ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని సూచించారు.ప్రసూతి కోరకు తీసుకొచ్చిన ఆశ కార్యకర్తలతో కలెక్టర్ మాట్లాడి వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.తదుపరి ఎమర్జన్సీ చైల్డ్ కేర్ సెంటర్ ను పరిశీలించి తక్కువ బరువు తో పుడుతున్న బేబి లకు ,పచ్చ కామెర్లు వచ్చిన బేబీ లకు , నెలలు రాకముందు పుట్టిన బేబీ లకు అందిస్తున్న చికిత్స లను సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు.అలాగే ఊపిరితిత్తులలో నిమ్ము తో ఇబ్బంది పడుతున్న మరియన్న తో కలెక్టర్ మాట్లాడి వైద్య సేవలు అందించాలని సిబ్బంది కి సూచించారు.

ఒపీ, ఐపీ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు కి సంబందించిన రిజిస్టర్లని పరిశీలించారు.సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకి వైద్య సేవలు అందించాలని అన్నారు.

రోగ నిర్ధారణ పరీక్షలు చేసే టి హబ్ సెంటర్ ని , సెంట్రల్ డ్రగ్ సెంటర్,ఫార్మసి స్టోర్ లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకొని అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని లేని వాటిని ముందుగానే తెప్పించుకోవాలని ఆదేశించారు. మందులు లేవు



చెప్పకూడదని లోని వాటిని వెంటనే తేప్పించాలని అన్నారు.

జి జి హేచ్ ఆవరణలో నిర్మిస్తున్న నూతన బిల్డింగ్ ని కలెక్టర్ పరిశీలించారు. కూలీలను ఎక్కువ గా ఏర్పాటు చేసుకొని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చే లాగా కృషి చేయాలని కాంట్రాక్టర్ కి సూచించారు.

ఈ కార్యక్రమం లో రెసిడెన్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రశాంతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో నేతన్నలకు యారన్ డిపో మంజూరు

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సిరిసిల్ల, : ఎన్నో ఏళ్లుగా సిరిసిల్ల నేతన్నలు ఎదురు చూస్తున్న యారన్ డిపోకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రభుత్వం జీవో నంబరు 18 ద్వారా యారన్ డిపోను రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ కేంద్రంగా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. దీని కోసం రూ. 50 కోట్ల నిధులను కేటాయించినట్లు ఆయన తెలిపారు. సిరిసిల్లలో 35 వేల మరమగ్గాలు ఉండగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది కార్మికులు లబ్ధి పొందుతున్నారు. పవర్‌లూమ్ పరిశ్రమకు లబ్ధి చేకూరే యారన్ డిపో మంజూరు చేయాలని కార్మికులు 30 ఏళ్లుగా కోరుతున్నారు. ఇన్నేళ్లకు సిరిసిల్ల కార్మికుల కల నేరవేరుస్తూ ప్రభుత్వం యారన్ డిపోను మంజూరు చేసింది.

టెస్కో ఆధ్వర్యంలో డిపోను నిర్వహించనున్నారు. దీని ద్వారా క్రెడిట్ పద్ధతిలో పరిశ్రమకు అవసరమయ్యే నూలును సరఫరా చేసి వస్త్రాన్ని కొనుగోలు చేయనున్నారు. వేములవాడ కేంద్రంగా యారన్ డిపో ఏర్పాటుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో మరో మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నల్లగొండ జిల్లా నిడమ నూరు, హనుమకొండ జిల్లా ఆత్మకూర్, నారాయణపేట జిల్లా కోస్గి మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించినట్లు ఆయన చెప్పారు. వీటితో ఇప్పటివరకు 81 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియామకం పూర్తయినట్లు తుమ్మల వెల్లడించారు.

# జి.ఎస్.ఐ. శిక్షణా సంస్థ అత్యధిక శిక్షణా అత్యుత్తమ పూర్తి చేసిన ఉద్యోగులకు గనుల మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి చేతుల మీదుగా సత్కారం

**iGOT కర్మయోగి అనేది ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్, ఇది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉద్యోగులందరి సామర్థ్యాన్ని పెంపొందించడానికి డిజిటల్ ఇండియా లో బాగంగా అభివృద్ధి చేయబడింది.**



హైదరాబాద్ : జి.ఎస్.ఐ. ఉద్యోగులందరూ iGOT కర్మయోగి పోర్టల్‌లో చేర్చబడ్డారు మరియు సంస్థ సూచించిన తప్పనిసరి కోర్సులకు హాజరవుతున్నారు. GSI శిక్షణా సంస్థ, %రిస్త్రంఊ% కర్మయోగి ప్లాట్‌ఫారమ్‌లో GSI ఉద్యోగుల అభ్యాసానికి సంబంధించిన కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది మరియు సమన్వయం చేస్తుంది. GSI ఉద్యోగులు మొత్తం 169949 iGOT కోర్సులను నమోదు చేసుకున్నారు, అందులో వారు 148238 కోర్సులను పూర్తి చేశారు. GSI ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ GSITI) iGOTకర్మయోగి ప్లాట్‌ఫారమ్‌లో 41 ఆన్‌లైన్ కోర్సులను అప్‌లోడ్ చేసింది, ఇందులో 86 గంటల-56 నిమిషాల వ్యవధిలో 421 లెక్చర్ వీడియోలు ఉంటాయి. GSITI కోర్సులలో మొత్తం 57632 మంది పాల్గొనేవారు నమోదు చేసుకున్నారు మరియు 25283 మంది పార్టిసిపెంట్లు ఇప్పటికే కోర్సులను పూర్తి చేసారు. iGOT కర్మయోగి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయబడిన మొత్తం 1428 ప్రోగ్రామ్‌ల నుండి కోర్సులను ఎంచుకోవడానికి ఉద్యోగులు ఐచ్ఛికం. గనుల మంత్రిత్వ శాఖ, ప్రభుత్వం iGOT కర్మయోగి పోర్టల్‌లో 100 కంటే ఎక్కువ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన జి.ఎస్.ఐ. అధికారులకు అవార్డులను గౌరవనీయులైన బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రదానం చేశారు. 8 మంది ఉద్యోగులు ఈ అవార్డులను అందుకున్నారు. ఉద్యోగుల వివరాలు.

1. శ్రీ పప్పు భౌమిక్, కెమిస్ట్ (258 కోర్సులు), 2. శ్రీమతి. అజి థామస్, అసిస్టెంట్ (225 కోర్సులు), 3. డాక్టర్ జ్ఞానేష్ లష్కరీ, డైరెకర్ (జియోఫిజిక్స్) (188 కోర్సులు), 4. శ్రీ బిను వర్గీస్ థామస్, సూపరింటెండింగ్ జియాలజిస్ట్ (156 కోర్సులు), 5. శ్రీమతి. లయీకా సుల్తానా, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (131 కోర్సులు), 6. శ్రీ శ్రీనివాసరావు పంగులూరి, సీనియర్ కెమిస్ట్ (131 కోర్సులు), 7. శ్రీ మనోజ్ కుమార్ మీనా, డ్రైవర్ (109 కోర్సులు), 8. శ్రీమతి. జూలీ జైస్వాల్, జియాలజిస్ట్ (101 కోర్సులు).

శ్రీమతి. లయీకా సుల్తానా పబ్లికేషన్ డివిజన్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సదరన్ రీజియన్, హైదరాబాద్‌లో 11 జనవరి 2024 నుండి iGOT కోర్సులకు హాజరు కావడం ప్రారంభించి iGOT కర్మయోగి పోర్టల్ నుండి మొబైల్ యాప్ ద్వారా 131 కోర్సులను పూర్తి



చేసింది. ఆమె తన అధికారిక విధులకు హాజరవుతున్నప్పుడు తన ఖాళీ సమయంలో మరియు సెలవు దినాలలో కూడా చాలా కోర్సులు చేశానని ఆమె వ్యక్తం చేసింది. ఆఫీసు వ్యవహారాలు మరియు విధానాల గురించి ఈ శిక్షణల నుండి ఆమె చాలా సంబంధిత విషయాలను నేర్చుకుంది. గౌరవనీయులైన భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ మనోజ్ కుమార్ మీనా, ఇంజినీరింగ్ విభాగంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు, iGOT కర్మయోగి పోర్టల్ నుండి మొబైల్ యాప్ ద్వారా 109 కోర్సులను పూర్తి చేసారు. గౌరవనీయులైన భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అతను డ్యూటీలో ఖాళీ సమయాన్ని మరియు వారాంతపు సెలవుల్లో కూడా కోర్సులను పూర్తి చేయడానికి ఉపయోగించుకున్నాడు. డ్రైవింగ్‌లో ఏకాగ్రతను పెంపొందించడంలో యోగాపై కోర్సు తనకు సహాయపడిందని, OCBIS పోర్టల్ ద్వారా బిల్లుల తయారీలో బేసిక్ కంప్యూటర్ అప్లికేషన్‌లపై కోర్సు సహాయపడిందని మరియు సమయ నిర్వహణ తన విధిని సమర్ధవంతంగా నిర్వహించడంలో సహాయపడిందని వ్యక్తిగతంగా మరియు వృత్తిపరంగా ప్రయోజనం పొందాను అని ఆనందం వ్యక్తం చేశాడు.

GSI యొక్క డ్రైవర్ మరియు MTS ద్వారా 100 iGOT కోర్సులను విజయవంతంగా పూర్తి చేయడం వలన ఇతర అధికారులు iGOT కర్మయోగి పోర్టల్ ద్వారా మరిన్ని కోర్సులు చేపట్టేందుకు మరియు వారి సామర్థ్యాలను పెంపొందించడానికి ప్రేరణగా నిలుస్తుంది.

డా. మల్లేశ్ గంజి

సీనియర్ జియోలజిస్ట్ & PRO GSITI, Hyderabad

# బీఎస్సీ నర్సింగ్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, : నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్ల కోసం ఈ నెల 6 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. దరఖాస్తులకు అక్టోబరు 14న సాయంత్రం 6 గంటల వరకు అవకాశం కల్పించింది.

వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో చదివిన వారే అర్హులని పేర్కొంది. అభ్యర్థులు తెలంగాణ ఇంజనీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపింది. జనరల్ అభ్యర్థులు 50%, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 40%, దివ్యాంగులకు 45% కటాఫగా నిర్ణయించింది. వివరాలకు హెల్త్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది.

# ఫార్మసిస్ట్ ల సమస్యలు పరిష్కరిస్తా

## డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా. బి.రవీంద్ర నాయక్



డా. బి. రవీంద్ర నాయక్,డైరెక్టర్ ఆఫ్ హెల్త్ గారు వరంగల్ పర్యటన కు వచ్చిన సందర్భంగా టీ జీ పి ఏ రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ మరియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు గారల ఆధ్వర్యంలో హన్మకొండ లోని పోచమ్మ కుంట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో సార్ ను కలిసి శాలువా కప్పి పూల భోకే ఇచ్చి అడ్వాన్స్ విజయ దశమి శుభాకాంక్షలు తెలియ జేయడం జరిగింది.

ఈ సందర్భంగా టీ. జీ.పి.ఏ. రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ మరియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు గారలు ఫార్మసిస్ట్ లు ఎదురకొంటున్న సమస్యలను డైరెక్టర్ గారి ద్రుష్టి కి తీసుకెల్లగా తప్ప కుండా ఫార్మసిస్ట్ల సమస్యలు అన్నింటిని పరిష్కారం చేస్తా అని హామీ ఇచ్చినారు. ముఖ్యం గా ఫార్మసీ ఆఫీసర్ ఫైల్ గురించి సెక్రటేరియట్ నుండి అధికారులు రిమార్ప్ అడుగగా అట్టి ఫైల్ ను పాజిటివ్ గా రాసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని చెప్పినారు.త్వరలో నే అన్ని జోన్స్ లలో ఖాళీలను గుర్తించి ప్రమోషన్ లు కూడా ఇస్తా మని,నోటిఫికేషన్ లో ఇచ్చిన విధంగా
ఫార్మసిస్ట్ పోస్ట్లు కూడా త్వరలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చినారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.సతీష్, వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి. హెచ్ ప్రేమ్ సాగర్, యం. అవినాష్, రాష్ట్ర నాయకులు సతీష్ రెడ్డి, విప్లవ కుమార్, ప్రకాష్ రావు, సరళ, తదితరులు పాల్గొన్నారు .

# ఘనంగా బతుకమ్మ సంబురాలు

ధారూరు, : ధారూరులోని వివిధ కాలనీలలో మహిళలు బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకున్నారు. వివిధ రకాల పువ్వులతో బతుకమ్మలను తయారుచేసి పూజలు చేశారు. మహిళలు, యువతులు బుధవారం రాత్రి బతుకమ్మలతో స్థానిక వీరభద్రేశ్వర ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మల చుట్టూ తిరగుతూ పాటలు, పాడుతూ ఆడారు. అనంతరం స్థానిక చెన్నయ్య నీటి కుంటలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

%ధారూరులోని వివిధ కాలనీలలో మహిళలు బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకున్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

కొడంగల్: బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

మోమిన్‌పేట్: మండలంలోని అమ్రాదికలాన్‌లో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగు, రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలతో గ్రామ పురవీధుల మీదుగా ఊరేగించారు.

# హైదరాబాద్ లో 'ఎఫ్ డీ డీ ఐ' నాలుగో స్నాతకోత్సవ వేడుకలు

## ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ హాజరు




హైదరాబాద్ లోని ఫుట్ వేర్ డిజైన్ అండ్ డెవలప్ మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్ డీ డీ ఐ) నాలుగో స్నాతకోత్సవ వేడుకలు ఈరోజు సంస్థ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి.

ఈ వేడుకలకు తెలంగాణా గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖల ముఖ్య కార్యదర్శి శ్రీ జయేష్ రంజన్, ఎఫ్ డీ డీ ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి, డాక్టర్ నరసింహు గారి తేజ్ లోహిత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

ఈ సందర్భంగా ప్రసంగించిన గవర్నర్ విద్యార్థుల కు అభినందనలు తెలియజేశారు. తాజా ధోరణులకు ఆలవాలమైన పాదరక్షలు, ఫ్యాషన్, రీటైల్, తోలు ఉత్పత్తుల రంగంలో నిలదొక్కుకొనేందుకు సృజనాత్మకతను, పారిశ్రా మిక స్ఫూర్తిని అలవర్చుకోవాలని వారికి పిలునిచ్చారు. "నేటి ప్రపంచంలో ఈ లక్షణాలు కేవలం ప్రయోజనాలను కలిగించేవి మాత్రమే కాదు, అత్యవసర నైపుణ్యాలు కూడా.." అని పేర్కొన్నారు.

ఎఫ్ డీ డీ ఐ పట్టభద్రులకు శుభాకాంక్షలు తెలియ జేసిన శ్రీ జయేష్ రంజన్, తాము ఎంచుకున్న రంగంలో నాయకత్వ పాత్రను చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని, ఆయా రంగాల అభివృద్ధికి పాటుపడాలని చెప్పారు. "భవితకు మీరే సారథులు" అంటూ వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.

కార్యక్రమంలో భాగంగా, పాదరక్షలు, ఫ్యాషన్, రీటైల్, తోలు ఉత్పత్తుల రంగాల ఎఫ్ డీ డీ ఐ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయి విద్యార్థులు108 మందికి పట్టాలను ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ, సృజన, పట్టుదల కనబరిచి, తమ విద్యార్థి జీవితాన్ని సఫలం చేసుకున్న వీరి అంకితభావం, వారి భవిష్య విజయాలకు పునాది కానుంది.

అధ్యక్షోపన్యాసం చేసిన ఎఫ్ డీ డీ ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నరసింహుగారి తేజ్ లోహిత్ రెడ్డి, విద్యార్థుల కు ముందుగా అభినందనలు తెలియజేశారు. వారు ముందుముందు చేపట్టబోయే కార్యక్రమాల్లో నాయకత్వం, సృజన, సామాజిక బాధ్యత అనే అంశాలు ఎంతో ప్రాముఖ్యత కలిగినవని దిశానిర్దేశం చేశారు.

మార్పుకి వారే సారథులు కావాలనీ, స్థిరమైన అభివృద్ధిని సాధించేందుకు తమ నైపుణ్యాలను వినియోగిస్తూ, ఎంచుకున్న రంగాల్లో తమదైన ముద్ర వేయాలని పిలుపునిచ్చారు. కోర్సుల అధ్యయనం, ప్రాజెక్టు పనుల్లో ప్రతిభ, సృజనాత్మకత చూపిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభకు, వినూత్న ఆలోచలకు ప్రోత్సాహం అందించే ఎఫ్ డీ డీ ఐ నిబద్ధతకు విద్యార్థుల విజయాలు నిదర్శనంగా నిలిచాయి.

పాదరక్షలు, ఫ్యాషన్, రీటైల్, తోలు ఉత్పత్తుల డిజైన్ల రంగంలో ఉన్నత స్థాయి విద్యను అందిస్తూ ఆయారంగాల్లో భవిష్యత్ లీడర్లను సన్నద్ధం చేస్తున్న సంస్థ ఎఫ్ డీ డీ ఐ. భవిష్య నేతలు, సృజనకారులు, మార్గదర్శకులను దేశానికి అందించాలనే సంస్థ లక్ష్యానికి నేటి స్నాతకోత్సవ వేడుకలు అద్దం పట్టాయి.

# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆరోగ్య కేంద్రాల పై కేంద్ర బృందం పర్యటన



మేడ్చల్–మల్కాజిగిరి, : కేంద్ర ప్రభుత్వానికి చెందిన పర్యవేక్షక బృందం ఈ రోజు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కుషాయిగూడను సందర్శించింది. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల కింద ముఖ్యమైన ఆరోగ్య సూచికలను సమీక్షించడానికి ఈ పరిశీలన జరిగింది.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. రఘునాథ స్వామి కేంద్ర బృందానికి తో సమీక్షలో పాల్గొన్నారు. ఈ పరిశీలనలో ప్రధానంగా వ్యాక్సిన్ లాజిస్టిక్స్, పుట్టిన వెంటనే ఇచ్చే టీకాల ప్రక్రియ, AEFI అనాఫైలాక్సిస్ కిట్ల వంటి కీలక వనరుల లభ్యతపై దృష్టి సారించారు.

పర్యవేక్షక బృందం పుట్టిన వెంటనే ఇచ్చే టీకాల నిర్వహణను సమీక్షించింది, టీకాలు తక్షణం అందుతున్నాయా మరియు HMIS మరియు U-WIN వ్యవస్థలలో సరిగ్గా నమోదు అవుతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. తల్లులతో చర్చలు జరిపి, MCP కార్డుల ద్వారా టీకా ప్రగతిని ట్రాక్ చేయడం ఎలా జరుగుతోంది అన్నదానిపై పరిశీలన జరిగింది. పుట్టిన వెంటనే టీకాలు ఎందుకు ఇవ్వలేకపోయారు అనే కారణాలను కూడా విశ్లేషించారు.

ఈ పరిశీలనలో ఉపజిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిలు డా సత్యవతి, డా శోభ మరియు జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డా సరస్వతి పాల్గొన్నారు.

# పర్యావరణ వ్యవస్థలో ప్రతీ జీవి ముఖ్యమే

సిద్దిపేట : పర్యావరణ వ్యవస్థలో ప్రతీ జీవి ముఖ్యమైనదేనని జిల్లా అటవీశాఖ అధికారి కొత్తపల్లి శ్రీనివాస్, ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. 70వ వన్యప్రాణి పరిరక్షణ వారోత్సవాలను సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్)లో అటవీశాఖ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలను నిర్వహిం చారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి మెడల్స్ అందించారు. అంతకుముందు విద్యార్థిని, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రకృతి సమతుల్యతను కాపాడలని, మొక్కలు, వన్యప్రాణులు ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారయణరెడ్డి, అటవీశాఖ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వానాకాలం ధాన్యం సేకరణ పై ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ బాగా పని చేయాలి : జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి






ఈ వానాకాలం ధాన్యం సేకరణ పై ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ బాగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు.

ఆయన వానకాలం ధాన్యం సేకరణ కు సంబంధించి సమాచారం ,ఫిర్యాదుల స్వీకరణకు ఉద్దేశించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ను ప్రారంభించారు.



ఈ వానాకాలం ధాన్యం కొనుగోలు లో ఏవైనా సమస్యలు తలెత్తిన రైతులు లేదా ఇతరులు ఈ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన, 24 గంటలు పని చేసే ఫోన్ నెంబర్ 9963407064 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటలకు పని చేసే విధంగా రెండు విడతలలో విధులు నిర్వహించేలా సిబ్బందిని నియమించడం జరిగిందని, ఈ కంట్రోల్ రూమ్ లో వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలు, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన సిబ్బంది పని చేస్తారని స్పష్టం చేశారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాలలో ఏదైనా ఇబ్బందులు ఏర్పడిన, లేదా ఎక్కడైనా ధాన్యం కొనుగోలు జరగకపోయినా వెంటనే కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి తెలియజేయవచ్చని, సంబంధిత అధికారులతో ఆ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

అదేవిధంగా రాష్ట్రస్థాయిలో సైతం ధాన్యం సేకరణ, కొనుగోలు కు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్రస్థాయి లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1 9 6 7 లేదా 180042500333 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని ఆయన స్పష్టం చేశారు .

అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు ఉన్నారు

# చాలా కాలంగా ఎదురుచూస్తున్న శుభవార్త



ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా అవతరించనున్న ఆల్ ఇండియా ట్యాక్స్ పేయర్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటుకు కమిటీ ని ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు నిన్న నిర్ణయించింది. ఏ ప్రభుత్వం పాలిస్తున్నప్పటికీ, ఈ సంస్థ ఆమోదం లేకుండా ఏ ప్రభుత్వం కూడా ఉచిత విద్యుత్, ఉచిత నీరు, ఉచిత పంపిణీ లేదా రుణమాఫీని ప్రకటించదు. డబ్బు మా పన్ను చెల్లింపుదారులకు చెందినది కాబట్టి, దాని వినియోగాన్ని పర్యవేక్షించే హక్కు పన్ను చెల్లింపుదారులకు ఉండాలి. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఉచితంగా పంపిణీ చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు.

ప్రభుత్వం ప్రకటించే ఏ ప్రాజెక్టులైనా ముందుగా వాటి బ్లూప్రింట్‌లను సమర్పించి ఈ సంస్థ నుండి అనుమతి పొందాలి. ఇది MPలు మరియు MLAల జీతాలకు మరియు వారు పొందే ఇతర విచక్షణ రహిత ప్రయోజనాలకు కూడా వర్తింపజేయాలి. ప్రజా స్వామ్యం కేవలం ఓటుకు మాత్రమే పరిమితమా ? ఆ తర్వాత పన్ను చెల్లింపుదారులుగా మనకు ఎలాంటి హక్కులు ఉన్నాయి? పార్లమెంటును అడ్డుకున్నందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలను బాధ్యులను చేసే హక్కు పన్ను చెల్లింపుదారులకు ఉండాలి మరియు వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. వారు అన్ని "సేవకులు" తర్వాత పన్ను చెల్లింపుదారులచే చెల్లించబడతారు. అటువంటి "ఉచితాలను" ఉపసంహరించుకునే హక్కు కూడా తక్షణమే వినియోగించబడుతుంది.

మీరు అంగీకరిస్తే, దయచేసి వీలైనంత ఎక్కువ మందిని సంప్రదించండి. దీన్ని చేయడానికి, పోస్ట్‌ను భాగస్వామ్యం చేయండి. దీన్ని మీ స్నేహితుల్లో కనీసం 10 మందికి పంపండి. దయచేసి ఈ సందేశాన్ని వైరల్ చేయడానికి షేర్ చేయండి.

# ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం గారి 93వ జయంతి వేడుకలు



హైదరాబాద్, : ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతె శ్రీలత శోభన్ రెడ్డి గారు మరియు టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మోతె శోభన్ రెడ్డి గారితో కలిసి తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో మాజీ ప్రెసిడెంట్ శ్రీ ఏపీజే అబ్దుల్ కలాం గారి 93వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటా నికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు కలాం గారి దేశసేవకు చేసిన అపూర్వమైన కృషిని స్మరించుకున్నారు. విద్య, విజ్ఞానం మరియు సాంకేతికత రంగాలలో ఆయన చేసిన మార్గదర్శక పాత్రను గురించి మాట్లాడారు.

డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతె శ్రీలత శోభన్ రెడ్డి గారు మాట్లాడుతూ "కలాం గారి జీవితం ప్రతి యువకుడికి ప్రేరణగా నిలవాలి" అని పేర్కొన్నారు.

విద్యలో పురోగతి సాధించడం ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమవుతుందనీ, ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తోందనీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పవన్ కళ్యాణ్, భాస్కర్, రాజు గంట, అనిల్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు



# వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండండి

## రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్

హైదరాబాద్ -: నుండి మూడు రోజుల పాటు నగరంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడం తో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అధికారులను ఆదేశించారు.

ముఖ్య కార్యదర్శి హైడ్రా కమిషనర్, జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ శాఖ ఆయా విభాగాల సి ఈ, యస్ ఈ లతో తెలికేన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ల ను ఆదేశించారు.

వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిలువకుండా క్షేత్రస్థాయిలో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేసి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా క్షేత్ర స్థాయి అధికారులు ను ఆదేశించారు.. ట్రాఫిక్ పోలిస్, వాటర్ వర్క్స్ విద్యుత్ శాఖల సమన్వయంతో పనిచేసి నగర వాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు కూడా అత్యవసరం ఉంటేనే బయటకు రావాలని నీరు నిలిచిన ప్రవహించే నాళాల వద్దకు చిన్న పిల్లలను వృద్ధులను ఓటరుగా పంపవద్దని దాన కిషోర్ కోరారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సహాయం కొరకు జి హెచ్ ఎం సి హెల్ప్ లైన్ నంబర్ 040-2111 1111 కు గాని డి అర్ ఎఫ్ ( హైడ్రా) 900011 667 నంబర్ కు కాల్ చేయాలన్నారు. మ్యాన్ హెల్స్ ఓపెన్ చేయకూడదని నిలిచిన నీటిలో ద్విచక్ర వాహనాలు గాని కాళి నడకన వెళ్లవద్దని ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ నగర్ వాసులను కోరారు.

# దుర్గామాత ఆలయం నిర్మాణం చేపడతా : భూపాల్‌రెడ్డి



నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని బ్రహ్మంగారి గుట్టపైన దుర్గామాత ఆలయాన్ని నిర్మించనున్నట్లు మాజీ ఎ మ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన బ్రహ్మంగారి గుట్టను దర్శించుకొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ బ్రహ్మంగారి గుట్ట ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ప్రశస్తి పొందిందన్నారు. బెజవాడ కనకదుర్గ మ్మ మాదిరిగానే బ్రహ్మంగారి గుట్టపై వెలసిన అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తుందన్నారు.

గతంలో ప్రకటించిన రూ. 50లక్షలకు తోడు మరిన్ని నిధులను కలిపి నిర్మాణం చేపడుతానన్నారు. అనంతరం పట్టణంలో పలు మండపాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షు డు బోనగిరి దేవేందర్, కౌన్సిలర్ మారగోని భవాని, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, రావుల శ్రీనివాస్, మెరుగు గోపి, రేగట్టే మహేందర్‌రెడ్డి, రాపోలు వెంకటేశ్వర్లు, వివేక్‌రెడ్డి పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి కమిషనర్ గా బాధ్యతలను స్వీకరించిన ఇలంబర్తి.




హైదరాబాద్, : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) కమిషనర్గా ఇలంబర్తి.కె గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, పంకజ, రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న సిసిపి శ్రీనివాస్, సిసిపిఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, , ఓ.ఎస్.డి వేణుగోపాల్, ఆయా విభాగాల సీనియర్ అధికారులు కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# చేపల పెంపకంతో మత్స్యకారులు అభివృద్ధి చెందాలి

శామీర్‌పేట, : చేపల పెంపకంతో మత్స్యకారులు అభివృద్ధి చెందాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.

జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం వారు ముఖ్య అతిథులుగా హాజరై శామీర్‌పేట పెద్దచెరువు నీటిలో చేపపిల్లలను వదిలారు. ప్రభుత్వం నుంచి 100శాతం సబ్సిడీ కింద 80-100 ఎంఎం సైజ్‌లో ఉన్న 3,60,000 కట్ల, రవ్వ, మోను, రకాల విత్తన చేపపిల్లలను వారు చెరువు నీటిలో వదిలారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫిష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి, జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ మన్నె రాజు, మోహన్‌కృష్ణ, వేణుగోపాల్, వెంకటేశం, దేవేందర్, అనురాధ, సత్యవతి, రాము పాల్గొన్నారు.

# ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత

## రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




తమ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

గ్రామీణ క్రీడాకారులలో క్రీడల పట్ల అవగాహన కల్పించి, క్రీడలను పెంపొందించేందుకు ఉద్దేశించి చేపట్టిన సీఎం కప్పు క్రీడలలో భాగంగా నిర్వహిస్తున్న టార్చ్ ర్యాలీ నల్గొండ జిల్లా కేంద్రానికి చేరుకోగా, మంత్రి క్లాక్ టవర్ వద్ద టార్చ్ ర్యాలీ జ్యోతిని అందుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక సామర్థ్యం తో పాటు, మానసిక సామర్థ్యం పెరుగుతుందని, ప్రత్యేకించి విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. క్రీడలలో తెలంగాణ రాష్ట్రాన్ని ముందు ఉంచేందుకు ప్రభుత్వం అనేక రకాల కార్యక్రమాలు చేపడుతున్నదని, ఇందులో భాగంగా వివిధ రకాల క్రీడలలో పథకాలు పొందిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలతో పాటు, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం క్రీడా కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సి .నారాయణ రెడ్డి ఈ కార్య క్రమంలో పాల్గొని టార్చ్ ర్యాలీని అందుకున్నారు. జిల్లా ఇన్చార్జి క్రీడల అభివృద్ధి అధికారి విష్ణు గౌడ్ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు



# ఆర్ బి ఎస్ కె ద్వారా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు..

## జిల్లా కలెక్టర్ : తేజస్ నంద్ లాల్ పవార్

**జిల్లాలో యస్ ఎ యుమ్ (SAM%), యమ్ ఎ యమ్ (MAM) తో బాధపడుతున్న పిల్లలు లేకుండా చూడాలి**



సూర్యాపేట : జిల్లాలో పిల్లలందరికి నాణ్యమైన పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరం లో రాష్ట్రీయ బాల స్వస్థ్యా కార్యక్రమం(ఆర్ బి ఎస్ కె )పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు , శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ బి ఎస్ కె అనేది పిల్లల జీవన నాణ్యతను మెరుగుపర్చి సమగ్ర సంరక్షణ అందించే కార్యక్రమని,దీని ద్వారా పుట్టుకతో వచ్చే లోపాలు (Birth defects ), వ్యాధులు (Diseases%), వైకల్యంతో అభివృద్ధి ఆలస్యం (Devolpement delays), లోపాలు (Deficiences) అనే 4 డి లను అలాగే గుండె,చర్మం, డెంటల్ లాంటి 32 సాధారణ ఆరోగ్య పరిస్థితులను పుట్టిన నుండి 18 సంవత్సరాల పిల్లలకు ముందస్తుగా గుర్తించి ఉచితంగా చికిత్స, శస్త్ర చికిత్స లతో సహా స్క్రీనింగ్ ఉంటుందని తెలిపారు.జిల్లాలో ఆర్ బి ఎస్ కె బృందాలు 9 ఏర్పాటు చేశామని ప్రతి బృందం లో ఇద్దరు మెడికల్ అధికారులు, ఫార్మాసిస్ట్, ఎ యన్ యం లు ఉంటారని తెలిపారు..

ఆర్ బి ఎస్ కె ద్వారా ఆరోగ్య సమస్యలతో గుర్తించబడిన పిల్లలకు జిల్లా హాస్పటల్ నందు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. పుట్టుకతో వచ్చే సమస్యలు, చెవి,గుండె సమస్యలకి సంబందించిన పిల్లలకు కావాల్సిన చికిత్స ల కొరకు నిమ్స్ హాస్పిటల్ కి గాని, యన్ జి ఓ సేవలు ద్వారా గాని చికిత్స లు అందజేయటం జరుగుతుందని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలలో సంవత్సరానికి రెండు సార్లు 0-6 సంవత్సరాల పిల్లలకి స్క్రీనింగ్ టెస్ట్ లు చేస్తామని వారిలో సమస్యలు గుర్తిస్తే వెంటనే పోషకాహారం అందించుటకు శిశు సంక్షేమ అధికారులకు తెలియపర్చాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో,ఉన్నత పాఠశాల లో, రెసిడెన్సీయల్ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య టెస్ట్ లు చేసి సంబంధిత మెడిసిన్స్, చికిత్సలను అందించవచ్చు అని తెలిపారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది, శిశు సంక్షేమ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించి ప్రజలను ఆరోగ్యం సమస్యలనుండి సంరక్షించాలని సూచించారు.

ఆర్ బి ఎస్ కె ద్వారా ఆరోగ్య పరీక్షలు చేసే పాఠశాలల షెడ్యూల్ ని వారం ముందుగానే విద్యాశాఖ వారికి తెలపాలని సూచించారు.అలాగే కావాల్సిన మందులను ముందుగానే ప్రణాళిక లు తయారుచేసుకొని

ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో సివియర్ అక్యూట్ మాల్ న్యూట్రిషన్ (SAM ) తక్కువ బరువు ఉన్న కలిగి ఉన్నవారు , మోడరేట్ ఆక్యూట్ మాల్ న్యూట్రిషన్ మధ్యస్థ బరువుతో మధ్య బరువుతో పోషకాహర లోపం ఉన్నవారు (MAM)లతో బాధపడుతున్న వారికి అధిక పోషకాహారం అందించి జిల్లాలో లేకుండా చూసేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని సూచించారు.

యస్ ఎ యం, యం ఎ యం కి సంబదించిన వివరాలు వైద్య ఆరోగ్యం శాఖ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఒకే లాగా ఉండాలా చూసుకోవాలని అలాగే ఎస్ ఎ యం తగ్గించుటలో ప్రతి వారం పురోగతి ఉండాలని తెలిపారు.

న్యూట్రిషన్ రెహబిలిటేషన్ సెంటర్ (యన్ ఆర్ సి ) నందు అన్ని సౌకర్యాలు కల్పించాలని డి యం హెచ్ కి కలెక్టర్ సూచించారు.

అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకి నాణ్యమైన పోషకాహారం అందించాలని తెలిపారు.జిల్లాలో పోషణ్ అభియాన్ కార్యక్రమం విజయవంతం చేసినందుకు అంగన్వాడీ సిబ్బందికి అభినందనలు తెలిపారు.జిల్లాలో పర్యవేక్షణ బృందాలు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేస్తాయని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు హాజరు వివరాలు, స్టాక్ వివరాలు పరిశీలిస్తారని ఏమైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆదేశించారు.

ఈ కార్యక్రమం లో డి యం హెచ్ ఓ కోటాచలం, డి డబ్ల్యూ ఓ నరసింహారావు, ఆర్ బి ఎస్ కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ కోటి రత్నం, మెడికల్ అధికారులు, సి డి పి ఓ లు, సూపర్ వైజర్లు, ఫార్మాసిస్ట్ లు, ఎ యన్ యం లు, ఐ సి డి ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మూసీ ప్రక్షాళన కాంగ్రెస్ ధ్యేయం



బీబీనగర్, : మూసీని ప్రక్షాళనచేసి పూర్వ వైభవం తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలో రూ. 9.80 కోట్లతో సూరేపల్లి- చందుగానితండా, మొగ్దుం పల్లి- రామునిగుండ్ల తండా, గొల్లగూడెం-అనాజీపురం, చిన్నరావులపల్లి- తీనగానితండా రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం స్వచ్ఛమైన నీటితో మూసీ ప్రవహించేదని, కాలక్రమంలో కాలుష్య కాసారంగా మారి ఆయకట్టు గ్రామాలు పూర్తిగా జలకాలుష్యంతో అల్లాడిపోతున్నాయన్నారు. మూసీని పూర్తిగా ప్రక్షాళనచేసి మంచినీటి నదిగా మార్చి పూర్వ వైభవం తీసుకురావడకోసం సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. మూసీ కాల్వల విస్తరణ పనులు త్వరగా ప్రారంభించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం పలు గ్రామాల్లోని దుర్గామాత మండపాలను సందర్శించి అన్నప్రసాదాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాసరెడ్డి, నాయకులు రామాంజనేయులు గౌడ్, శ్యాంగౌడ్, పింగల్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, గడ్డం బాలకృష్ణ గౌడ్, బాల్‌రెడ్డి, నిఖిల్ రెడ్డి, బాలచందర్, ప్రభాకర్, గోపినాయక్, బాలరాజు తదితరులున్నారు.

# "అయోడిన్ కలిగిన ఉప్పునే వాడుదాం! ఆరోగ్యంగా ఉందాం"

## జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.వెంకట్.



హైదరాబాద్ : ప్రతి ఒక్కరూ అయోడిన్ కలిగిన ఉప్పునే వాడాలని, అయోడి న్ ఒక ముఖ్యమైన సూక్ష్మ పోషకము, మన గొంతు భాగంలో ఉన్న థైరాయిడ్ గ్రంథి ఈ అయోడిన్ సూక్ష్మ పోషకాలు ఉపయోగించుకొని థైరాక్సిన్ హార్మోన్ ఉత్పత్తి చేసి మన జీవ ప్రక్రియలు సక్రమంగా నిర్వర్తించుటకు పనిచేస్తుందని, దీనివల్ల శరీర పెరుగుదల, ఆరోగ్యం మెరుగవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ అన్నారు.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవ సదస్సులో మాట్లాడుతూ, అయోడిన్ అతి ముఖ్యమైన ఆరోగ్య సూక్ష్మ పోషకమని, దీని లోపంతో గర్భస్రావం, చనిపోయి పుట్టే శిశువులు, అతి తక్కువ బరువు తో పుట్టే శిశువులు, మరుగుజ్జు తనము, బుద్ధి మాంధ్యత, గొంతువాపు, పిల్లలు చదువులో వయసుకు తగ్గ ప్రతిభ చూపించలేక పోతారని, ముఖ్యంగా అయోడిన్ లోప రుగ్మతల బారినపడిన స్త్రీలు డాక్టర్ సలహా మేరకు మందులు వాడటం వలన గర్భస్థ దశలో సంభవించబోయే దుష్పరిణా మాలు పరిణామాలను అధిగమించవచ్చు అని, ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వవచ్చు అని తెలిపినారు. అందుకే ప్రజలందరూ అయోడిన్ కలిగిన ఉప్పును వాడాలని, ఆరోగ్యంగా ఉండాలని సదస్సులో వివరించినారు. హైదరాబాదు జిల్లాలోని అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా బస్తీ దవఖానాల ద్వారా ద్వారా ప్రజలందరికీ అయోడిన్ ఉప్పుని వాడునట్లు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపినారు.

జిల్లాలోని అందరూ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని పాఠశాలలలో, విద్యార్థి వసతి గృహాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని మరియు ఉప్పును విక్రయించే దుకాణాలలో తనిఖీలు నిర్వహించి ప్రతి నెల 50 ఉప్పునమూనాలు సేకరించి కేంద్ర ప్రయోగశాలకు పంపుతున్నట్లు తెలిపారు.

అయోడిన్ కలిగిన ఉప్పు వాడుట వలన మంచి శారీరక మానసిక ఆరోగ్యం, సరి అయిన పెరుగుదల, చురుకుతనం, ఉత్సాహం, మంచి జ్ఞాపకశక్తి కలిగి ఉండటం సంగ్రహణ శక్తి పెరగడం, సక్రమంగా గర్భస్థ శిశువు పెరుగుదల మరియు చదువుల్లో వయసుకు తగ్గ ప్రతిభను పిల్లలు



చూపుతారని ఈ సదస్సులో సూచించినారు.

తదనంతరం, అయోడిన్ ఉప్పు వాడకంపై పోస్టర్లు, కరపత్రములు ఆవిష్కరించినారు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆశ్రిత రెడ్డి, జిల్లా విస్తరణ మరియు మీడియా అధికారి జక్కుల రాములు, కార్యాలయ పరిపాలనాధికారి సునీల్ కుమార్,, డిప్యూటీ డెమోలు నరసింహ, అంజయ్య గౌడ్, గణాంకాధికారి ఒమర్ సాలేహ్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొనినారు.

నేటి ప్రపంచ హృదయ దినోత్సవమును పురస్కరించుకొని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో వివిధ కార్యాలయాల సముదాయంలోని 158 మంది సిబ్బందికి బిపి, షుగర్ మరియు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేసినారు.

# భారత్‌లో ఏ భాగాన్నీ పాకిస్థాన్ అనడానికి వీల్లేదు

- **అది ప్రాదేశిక సమగ్రతకే విరుద్ధం: సీజేఐ**
- **కర్ణాటక జడ్జి వ్యాఖ్యలపై తీవ్ర ఆక్షేపణ**
- **ఇప్పటికే జడ్జి విచారం వ్యక్తం చేయడంతో సుమోటో విచారణ మూసివేత**

బెంగళూరు: : భారతదేశంలోని ఏ భాగాన్నీ పాకిస్థాన్ అని అనకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. అలా సంబోధించడం దేశ ప్రాదేశిక సమగ్రతకే విరుద్ధమన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీశానంద ఓపెన్ కోర్టులో చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్ ఇటీవల కలకలం రేపాయి. ఒక వీడియోలో ఆయన బెంగళూరులో ముస్లిం ప్రాబల్య ప్రాంతాన్ని 'పాకిస్థాన్' అని వ్యాఖ్యానించారు. రెండో క్లిప్పింగ్‌లో.. ప్రత్యర్థి న్యాయవాదిని అడిగిన ప్రశ్నకు ఓ మహిళా లాయర్ జవాబు చెప్పినందుకు ఆమెను ఆయన మందలించారు. ఈ క్లిప్పింగులు వైరల్ కావడంతో సుప్రీంకోర్టు ఈ నెల 20న సుమోటో కేసుగా స్వీకరించింది. హైకోర్టు రిజిస్ట్రార్‌ను నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసుపై చీఫ్ జస్టిసతో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం బుధవారం మళ్లీ విచారించింది. జస్టిస్ వి.శ్రీశానంద వ్యాఖ్యలపై సీజేఐ అభ్యంతరం తెలిపారు. తన వ్యాఖ్యలపై సదరు న్యాయమూర్తి ఇప్పటికే విచారం వ్యక్తంచేయడంతో సుమోటో విచారణను కొనసాగించరాదని ధర్మాసనం నిర్ణయించింది. అయితే సీజేఐ ఈ సందర్భంగా న్యాయమూర్తులకు కీలక సూచనలు చేశారు. 'ఎలక్ట్రానిక్ మీడియా శకంలో న్యాయమూర్తులు సంయమనం పాటించాలి.

# రూ.20,000 కోట్ల పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: అన్నదాతలకు వ్యవసాయ పెట్టుబడి సాయం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్ల మొత్తాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారంనాడు విడుదల చేశారు. మహారాష్ట్రలోని వాశింలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని స్వయంగా పాల్గొని ఈ నిధులను విడుదల చేశారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా దేశవ్యాప్తంగా 9.4 కోట్ల మంది రైతులకు నేరుగా వారి అకౌంట్లలోనే ఈ మొత్తం జమ అవుతుంది.

పీఎం కిసాన్ నిధుల విడుదలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానితో పాటు మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్, మంత్రి సంజయ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా 732 కృషి విజ్ఞాన్ కేంద్రాలు, లక్ష ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాలు, 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్లతో సహా 2.5 కోట్ల మంత్రి రైతులు హాజరయ్యారు. భూములున్న రైతులకు మూడు వాయిదాల్లో ఏటా రూ.6,000 ఇచ్చే పీఎం-కిసాన్ పథకాన్ని 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించారు. శనివారంనాడు 18వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద ప్రధాని విడుదల చేసిన మొత్తంతో కలిసి ఇంతవరకూ రూ.3.45 లక్షల కోట్లకు పైగా పంపిణీ జరిగింది.

మహారాష్ట్రలో 17 ఇన్‌స్టాల్‌మెంట్స్‌లవో 1.20 కోట్ల రైతులకు రూ.32,000 కోట్లు జమ అయ్యాయి. 18వ ఇన్‌స్టాల్‌మెంట్‌గా 91.51 లక్షల రైతులు రూ.1,900 కోట్లకు పైగా ప్రయోజనం పొందనున్నారు. పీఎం కిసాన్ ఇన్‌స్టాల్‌మెంట్ పంపిణీతో పాటు రూ.2,000 కోట్లను నమో సేత్కారి మహాసన్మాన్ నిధి యోజన 5 ఇన్‌స్టాల్‌మెంట్ కింద మహారాష్ట్రకు ప్రధామంత్రి విడుదల చేశారు.

# ఇది డ్రోన్ యుగం !

## డ్రోన్ సమ్మిట్లో బహుముఖ ప్రయోజక విహంగాలు




గుంటూరు, : టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది.. డ్రోన్ టెక్నాలజీ రయ్‌మంటూ దూసుకుపోతోంది. రాబోయే రోజుల్లో ప్రతి రంగాన్నీ డ్రోన్ ప్రభావితం చేయనుంది. చేరుకోలేని దూరాల్ని, అందుకోలేని ఎత్తుల్ని సులువగా చేరుకోవడమే కాకుండా.. పనులన్నీ సులభతరం చేయడంలో డ్రోన్ టెక్నాలజీ కీలకపాత్ర పోషించనుంది. ఇటీవల వరదల సమయంలో విజయవాడ వరద బాధితులకు విశేష సేవలందించిన డ్రోన్ టెక్నాలజీ సాధారణ ప్రజా జీవితంలో అంతకుమించిన సేవలు అందిస్తోంది. కానీ ఆ వాస్తవం ప్రజలకు చేరడంలోనే సమస్య ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గుంటూరు జిల్లా మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో చేపట్టిన అమరావతి డ్రోన్ సమ్మిట్ ఆ సమస్యలను పరిష్కరించింది. ఇప్పటికే విస్తరించిన డ్రోన్ టెక్నాలజీ అందిస్తున్న సేవల గురించి, భవిష్యత్ డ్రోన్‌లదే అనే అంశాన్ని ప్రజలకు తెలిసేందుకు అవకాశం లభించింది. ఈ డ్రోన్ సమ్మిట్‌లో అనేక మంది యువ ఇంజనీర్లు అనేక రకాల డ్రోన్లను ప్రదర్శించారు. రైతులకు, వ్యాపారులకు, వైద్య సేవలకు అవి ఎలా ఉపయోగపడతాయో వివరించారు.

**ఇండస్ట్రియల్ ఇన్‌స్పెక్షన్ డ్రోన్లు..** పరిశ్రమల్లో వినియోగించేందుకు ప్రత్యేకంగా ఈ డ్రోన్ల రూపకల్పన చేశారు విశాఖకు చెందిన ప్రవీణ్ అనే యువ ఇంజనీర్. ఇవి మూడు రకాలు. యంత్రాల బయటి భాగాల్లో సమస్యలు గుర్తించడానికి ఎక్స్‌టర్నల్ డ్రోన్స్‌ను వినియోగిస్తారు. ఇవి ప్రమాదకర వాయువుల లీకేజీని గుర్తిస్తాయి. ఇన్‌సైడ్ డ్రోన్లు యంత్రాల లోపలి భాగాల్లోని సమస్యలను గుర్తిసాయి. ఇక పైపుల్లో ఉండే సమస్యలను కూడా గుర్తించేందుకు సూక్ష్మ డ్రోన్లను రూపొందించారు.

**ఆంధ్రులు స్థాపించిన స్టార్టప్.. వ్యోమిక్..** గోదావరి జిల్లాకు చెదిన ముగ్గురు యువ ఇంజనీర్లు హేమంత్, సాయిచరణ్, హనుమ కలిసి హైదరాబాద్ కేంద్రంగా స్టార్టప్ కంపెనీ వ్యోమిక్‌ను ఏర్పాటు చేసి రైతుల కోసం డ్రోన్లు సప్లై చేస్తున్నారు. ఇవి పూర్తిగా బ్యాటరీతో నడిచే డ్రోన్లు. ఒకసారి చార్జింగ్‌కు 15 నిమిషాల సమయం పడుతుంది. ఎకరం పొలంలో స్ప్రే చేయడానికి 6, 7 నిమిషాలు సమయం సరిపోతుంది. ఇక్కడ ప్రభుత్వ ప్రోత్సాహాలు చూశాక తిరిగి ఏపీకి రావాలని నిర్ణయించుకున్నామని వ్యోమిక్ వ్యవస్థాప కులు చెప్పారు. ప్రస్తుతం 80 డ్రోన్లు ఆపరేట్ చేస్తున్నామని,

2025 నాటికి ఒక్క ఏపీలోనే 2000 డ్రోన్లు ఆపరేట్ చేస్తామని చెప్పారు.

**125 కి.మీ వేగం.. 150 కి.మీ. దూరం !** తంజావూరుకు చెందిన ఏకాంత్ వైద్య సేవల కోసం ఒక డ్రోన్‌ను సిద్ధం చేశారు. 7 కిలోల బరువు మోయగల ఈ డ్రోన్ 125 కి.మీ వేగంతో 150 కిలోమీటర్ల వరకూ వెళ్లగలదు.

మైనస్ 1 నుంచి మైనస్ 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వుండే లగేజ్ బాక్సులో మందులు, మానవ అవయవాలు కూడా భద్రం చేసుకునే వీలుంది. అత్యవసరంగా సరఫరా చేయాల్సిన మందులు, అవయవాలను ఈ డ్రోన్ ద్వారా త్వరితగతిన గమ్యస్థానాలకు చేర్చవచ్చు.

**రెవెన్యూ సేవలకు.. స్కై హెప్టర్ వీటీఓఎల్** వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్ (వీటీఓఎల్) అంటే డ్రోన్‌లాగా నిట్టనిలువుగా టేక్ ఆఫ్ అవుతుంది. ఆ తరువాత నాలుగు వైపులా ఫ్యాను మోటార్లు ఆగిపోయి విమానంలా ముందుకు వెళుతుంది. ఇది రెవెన్యూ శాఖ మ్యాపింగ్‌కు ఉపయోగపడుతుంది. ఈ సంస్థ తమిళనాడు ప్రభుత్వంతో అనుబంధ సేవలందిస్తోంది. ఇందులో కెమెరాలు వేగంగా ఫొటోలు తీసి భూముల సర్వేను సులభతరం చేస్తాయి.

**డ్రోన్ బాల్‌తో సేఫ్టీ** చిన్న పిల్లలు, శిక్షణ లేకుండా డ్రోన్లు నడిపే వారు వాటిని ఢీకొట్టించే ప్రమాదం వుంది. దీంతో లక్షల రూపాయల విలువ చేసే డ్రోన్లు దెబ్బతినే ప్రమాదం వుంది. ఈ ప్రమాదాల నుంచి డ్రోన్లను రక్షించేందుకు వీలుగా శిక్షక డ్రోన్లను రూపొందించారు. డ్రోన్ చుట్టూ తేలికపాటి ప్లాస్టిక్, రబ్బర్ రక్షక వలయం వుంటుంది. దీంతో డ్రోన్ దేనికైనా గుద్దుకున్నా అది దెబ్బతినకుండా ఉంటుంది. **డ్రోన్.. వరదల్లో సాయం..** ఈ డ్రోన్‌ను కూడా గోపీనే రూపొందించారు. దీని ద్వారా సరుకులు రవాణా చేయవచ్చు. పది కిలోమీటర్ల పరిధిలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ డెలివరీలను కూడా ఇవ్వవచ్చు. వరదల సమయంలో విజయవాడలో బాధితులకు ఈ డ్రోన్ల ద్వారా ఆహారాలు, మందులు అందజేశామని గోపి చెప్పారు.

# అన్నివిధాలా అండగా ఉంటా

## బద్వేలులో హత్యకు గురైన బాలిక కుటుంబానికి సీఎం భరోసా


## 10లక్షల ఆర్థికసాయం అందించిన కలెక్టర్



బద్వేలు : ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన కడప జిల్లా బద్వేలుకు చెందిన ఇంటర్మీడియట్ బాలిక కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఫోన్‌లో పరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని బాలిక తల్లిదండ్రులను ముఖ్యమంత్రి ఓదార్చారు. 'మా ఆడబిడ్డకు జరిగిన అన్యాయం మరేబిడ్డకు జరగకుండా నిందితుణ్ణి కఠినంగా శిక్షించాల"ని బాలిక తల్లిదండ్రులు .. సీఎంను కోరారు. అల్లారుముద్దుగా పెంచుకున్నామని, మంచి చదువు చెప్పించి ప్రయోజకురాలిగా చేసుకోవాలని అనుకున్నామంటూ కన్నీరుమున్నీరయ్యారు. అధైర్యపడవద్దని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని వారికి చంద్రబాబు హామీ ఇచ్చారు. కుటుంబంలో ఒకరికి విద్యార్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్‌కు ఆయన ఆదేశాలు జారీ చేశారు. బాధితురాలి తమ్ముడికి రెసిడెన్షియల్ స్కూల్‌లో సీటు ఇప్పించాలని నిర్దేశించారు. సీఎం ఆదేశంతో బుధవారం రూ. 10లక్షల చెక్కును ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ బాధిత కుటుంబాన్ని కలిసి అందజేశారు.'

# నాతో పోటీ పడండి! మంత్రులు చురుగ్గా పనిచేయాలి: చంద్రబాబు

- సంఘటనలపై ఎప్పటికప్పుడు స్పందించాలి
- ప్రభుత్వం చేసే పనులనూ చెప్పుకోలేకపోతే ఎలా?
- ఉచిత ఇసుక గురించీ చెప్పలేకపోతున్నారు
- కేంద్రం చేసిన పనులపైనా ప్రచారం చేద్దాం
- రెండు నెలల్లో అభివృద్ధిని పట్టాలెక్కించాలి
- కేబినెట్ భేటీలో సీఎం పిలుపు



అమరావతి : 'మంత్రులందరూ నాతో పోటీ పడాలి.. ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఇన్‌చార్జి మంత్రులు, స్థానిక మంత్రులు తక్షణమే స్పందించాలి. ప్రభుత్వం చేసిన మంచి పనులను కూడా మంత్రులు ప్రచారం చేసుకోలేకపో తున్నారు' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంత్రివర్గ సమావేశంలో పలు సూచనలు చేశారు. ఉచిత ఇసుక విధానం ప్రకటించి 15 రోజులవుతున్నా.. ప్రజలకు ఆ విషయాలను సరిగా చెప్పలేకపోతున్నారని ఆక్షేపించినట్లు తెలిసింది. ఈ విధానం సక్రమంగా అమలయ్యే బాధ్యతను జిల్లా, ఇన్‌చార్జి మంత్రులు తీసుకోవాలన్నారు. పెన్షన్లు ఇచ్చామని, అన్న క్యాంటీన్లు అమల్లోకి తెచ్చామని, రైతులకు కల్పించిన ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విజయనగరం జిల్లాలో డయేరియాలాంటి సంఘటనలపై స్థానికంగా ఉన్న మంత్రులు వెంటనే స్పందించి ఉండాల్సిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తోందని.. రూ.100 కోట్లతో పలు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తోందని, ఈ విషయాలపై కూడా ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు.

**బోగస్ పెన్షన్లపై ఉపసంఘానికి నో** : బోగస్ పెన్షన్ల రద్దు, పెన్షన్ మంజూరు విధి విధానాలపై 8 మంది మంత్రులతో ఉపసంఘం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కేబినెట్ తిరస్కరించింది. పెన్షన్లు రద్దు చేసేందుకు ప్రస్తుతమున్న ఆరంచెల విధానాన్ని కూడా ఎత్తివేయాలని తీర్మానించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన అర్హతల ఆధారంగా పెన్షన్లు మంజూరుచేయాలని, తప్పుడు విధానంలో అనర్హులెవరైనా పెన్షన్లు పొందినట్లు ఫిర్యాదులొస్తే గ్రామసభలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసినట్లు సమాచారం.

**రాష్ట్రావతరణ వేడుక ఎప్పుడు?** రాష్ట్రావతరణ దినోత్సవం ఎప్పుడు జరపాలనే అంశంపై కేబినెట్ భేటీలో కీలక చర్చ జరిగింది. పొట్టి శ్రీరాములు 1952 డిసెంబరు 15న ఆత్మార్పణ చేశారని, 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైతే.. ఉమ్మడి ఏపీ నవంబరు 1న ఆవిర్భవించిందని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ నుంచి ఏపీ జూన్ 2న విడిపోయిన తేదీపైనా చర్చ జరిగింది. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణను తెలుగుజాతి గుర్తించాలని సీఎం పేర్కొన్నారు. జూన్ 2న ఏర్పడిన నవ్యాంధ్రను ఎలా గుర్తించాలనే అంశంపైనా చర్చ జరిగింది. గత టీడీపీ హయాంలో జూన్ 2 నుంచి వారం రోజుల పాటు నవ నిర్మాణ దీక్షలు చేపట్టామని మంత్రులు ప్రస్తావించారు. ఉచిత ఇసుక అమలుపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై అక్రమాలకు పాల్పడిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

# సమీక్ష అక్కర్లేదు.. 'ఎస్సీ వర్గీకరణ'పై సుప్రీంకోర్టు స్పష్టీకరణ రివ్యూ పిటిషన్ల కొట్టివేత



న్యూఢిల్లీ, : ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ చేసుకోవచ్చని, ఆ అధికారం రాష్ట్రాలకు ఉందంటూ అత్యున్నత న్యాయస్థానం ఆగస్టు 1న తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 మెజారిటీతో ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని విచారించిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, విక్రమ్ నాథ్, బేలా త్రివేది, పంకజ్ మిత్తల్, మనోజ్ మిశ్రా, సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం.. తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. "పిటిషన్లు అన్నింటినీ పరిశీలించాం. ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును పరిశీలించాల్సిన అవసరం కనిపించలేదు.

పిటిషన్లను కొట్టివేస్తున్నాం" అని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. గతంలో రాజ్యాంగ ధర్మాసనంలో భిన్నమైన తీర్పు ఇచ్చిన ఏకైక జడ్జి జస్టిస్ బేలా త్రివేది కూడా పిటిషన్ల కొట్టివేతకు మద్దతు తెలపడం విశేషం. రివ్యూ పిటిషన్లను కొట్టివేస్తూ గత నెల 24న ధర్మాసనం తీర్పు ఇవ్వగా.. శుక్రవారం దాన్ని అప్‌లోడ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు అవకాశం లేదంటూ 2004లో ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ ఏడాది ఆగస్టు 1న సీజేఐ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం తోసిపుచ్చింది. ఎస్సీల రిజర్వేషన్లను వర్గీకరించి, అదే వర్గంలో అత్యంత వెనకబడిన వర్గాలకు ప్రత్యేక కోటాలు కల్పించడానికి పచ్చజెండా ఊపింది. అయితే న్యాయసమీక్షకు లోబడే ఈ వర్గీకరణ ఉంటుందని స్పష్టం చేసింది. నిర్దిష్ట గణాంకాల ఆధారంగా, అత్యంత వెనకబడిన వర్గాలకు న్యాయం చేసేందుకే దాన్ని ఉపయోగించాలని పేర్కొంది. రాష్ట్రాలు రాజకీయ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటే వాటిని న్యాయస్థానాలు సమీక్షించవచ్చని తెలిపింది.

ఖనిజ సంపదపై పన్ను అధికారం రాష్ట్రాలదే...

ఖనిజ సంపదపై రాష్ట్రాలు పన్ను విధించవచ్చంటూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గనులు, ఖనిజాలతో కూడిన భూములపై పన్ను

విధించే అధికారం రాష్ట్రాలకే ఉంటుందంటూ అత్యున్నత న్యాయస్థానం ఈ ఏడాది జూలై 25న సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. దేశంలోని గనులు, ఖనిజాలపై కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని పక్కనపెట్టేలా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 8:1 ఆధిక్యంతో తీర్పు ఇచ్చింది. గనులు, ఖనిజాలపై పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదేనని, కేంద్రానిది కాదని స్పష్టం చేసింది. ఆ తీర్పును సమీక్షించాలంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషన్లన్నింటినీ పరిశీలించామని.. తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. రివ్యూ పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు గత నెల 24నే తీర్పు వెలువడగా.. ఇటీవల ఆ కాపీని అప్‌లోడ్ చేశారు.

**విమర్శించినంత మాత్రాన పాత్రికేయులపై కేసులా?** ప్రభుత్వంపై విమర్శలు చేశారన్న కారణంతో పాత్రికేయులపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని శుక్రవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య దేశాల్లో భావ స్వేచ్ఛ హక్కును గౌరవించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ హక్కుకు రాజ్యాంగంలోని 19(1)(ఏ) అధికరణం ప్రకారం రక్షణ ఉంటుందని పేర్కొంది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తనపై పెట్టిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ రాష్ట్రానికి చెందిన జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'యాదవ్ రాజ్ వర్సెస్ ఠాకూర్ రాజ్' అన్న శీర్షిక కింద 'ప్రభుత్వ యంత్రాంగంలో కుల సమీకరణలపై' ఆ పాత్రికేయుడు ఓ వ్యాసాన్ని రాశారు.

కీలక పదవుల్లో అధికారులను నియమించడంలో 'కుల పరంగా మొగ్గు' కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై అభ్యంతరం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం లఖ్‌నవూలోని హజరత్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో గత నెల 20న ఆయనపై కేసు పెట్టింది. భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదయింది.

జాతి సమగ్రతకు భంగం కలిగించడం, మతపర విద్వేషాలను రెచ్చగొట్టడం, పరువు నష్టం కలిగించడం సహా పలు ఆరోపణలు చేసింది. దీన్ని కొట్టివేయాలని కోరుతూ ఆయన చేసిన వినతిపై విచారణ జరిపిన ధర్మాసనం..ఇలాంటి కథనాలను ప్రభుత్వంపై చేసిన విమర్శలుగా భావించి క్రిమినల్ కేసులు పెట్టకూడదని తెలిపింది.ఆయనపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకూడదని ఆదేశించింది.

# క్రీడలపై ఆసక్తి పెంచేలా ప్రణాళికలు

సిరిసిల్ల, : యువత, విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి నైపుణ్యం పెంచేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియంలో ప్రారంభించిన సీఎం టార్చ్ రిలే ర్యాలీ మంగళవారం జిల్లాకు చేరు కుంది. సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ గాంధీ చౌక్ వరకు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా యువత జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించి పతకాలు సాధించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒలంపిక్స్‌లో రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. యూనివర్సిటీ ఏర్పాటు చేసి దానికి శివసేనరెడ్డిని నియమించారని పేర్కొన్నారు. జిల్లాలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి అవసరమైన ఏర్పాట్లు చేస్తామ న్నారు. క్రీడల్లో రాణించిన వారికి గ్రూప్–1 స్థాయి ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వేములవాడలో స్టేడియం పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నా మన్నారు. మండల కేంద్రాల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు నిధులు ఇచ్చినట్లు, మొదటి దశలో మండలాల్లో, రెండో దశలో గ్రామాల్లో, మూడో దశలో అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

గంజాయి రహిత జిల్లాగా ఉండాలి

యువత సన్మార్గంలో ముందుకు వెళ్లాలని గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి రహిత జిల్లాగా సిరిసిల్ల ఉండాలని ప్రభుత్వ విప్ శ్రీనివాస్ అన్నారు. గంజాయి రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని అన్నారు. గంజాయి నివారణకు కలెక్టర్, ఎస్పీలు కఠిన మైన చర్యలు చేపట్టాలన్నారు. యువత గంజాయికి అలవాటుపడితే కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీస్ ఆధ్వర్యంలో సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, ఆడెపు చంద్రకళ పాల్గొన్నారు.

# జాడలేని నామినేటెడ్ పదవులు

కరీంనగర్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా నామినేటెడ్ పదవులు దక్కక పోవడంతో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతల్లో అసహనం పెరిగిపోతున్నది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో దశాబ్దంపాటు అనేక కష్టనష్టాలకు ఓర్చి పార్టీ అధికారంలోకి రావడానికి శ్రమించిన తమపై పార్టీ నాయకత్వం చిన్న చూపు చూస్తుందనే అభిప్రాయం కార్యకర్తల్లో, ద్వితీయ శ్రేణి నేతల్లో వ్యక్తమవుతున్నది. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 అసెంబ్లీ స్థానాలకు గాను ఎనిమిది స్థానాలను కాంగ్రెస్ దక్కించుకున్నది. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పార్టీలో చేరడంతో ఎమ్మెల్యేల సంఖ్య తొమ్మిదికి చేరింది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్ నేతలు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రులుగా, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌కు అండగా నిలిచి మంచి ఫలితాలను సాధించి పెట్టినా నేతలకు నామినేటెడ్ పదవులు దక్కలేదు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అయిత ప్రకాశ్‌రెడ్డి, జనక్‌ప్రసాద్‌కు మాత్రమే పదవులు దక్కాయి. ఇవి మినహా మిగతా నామినేటెడ్ పదవులేవి భర్తీ చేయక పోవడం నేతల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీస్తుంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండగా ఈలోగా నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తే పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి వీలుకలుగుతుందని పార్టీ సీనియర్ నేతలు భావిస్తున్నారు.

పార్టీ పెద్దలు మాత్రం ఆ దిశగా ఆలోచనలు చేయక పోవడం పార్టీలో కలకలం రేపుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉమ్మడి జిల్లా కీలక పాత్ర వహించినా నామినేటెడ్ పదవుల భర్తీలో తగిన న్యాయం చేయడం లేదనే భావన బలంగా వ్యక్తమవుతున్నది.

**ఆశావహుల ప్రయత్నాలు** ఉమ్మడి జిల్లాకు సంబంధించి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ కీలకం కావడంతో వారిద్దరిపైనే జిల్లా నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఇద్దరు పార్టీలో సీనియర్ నేతలు కావడం ఉమ్మడి జిల్లా పార్టీ వ్యవహారాల గురించి వారికి సంపూర్ణ అవగాహన ఉండడంతో పార్టీ నేతలందరూ మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వస్తున్నారు. తమ అదృష్టం ఎప్పుడు తలుపుతడుతుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఒక వైపు తమ నియోజకవర్గ ఎమ్మెల్యేలను, ఇన్‌ఛార్జిలను ప్రసన్నం చేసుకుని మరో వైపు మంత్రులను ప్రసన్నం చేసుకోవడానికి తంటాలు పడుతున్నారు. పార్టీ అధికారంలో లేనప్పుడు బీఆర్ఎస్ నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొన్నా పదవుల కోసం ఇంతగా కష్టాలు పడాల్సిన



రావడంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలువురు సీనియర్ నేతలు పార్టీ ద్వారా లబ్ధి పొంది అధికారాలను అనుభవించి ఇతర పార్టీలకు వలస పోయారు. తాము మాత్రం పార్టీని నమ్ముకుని అనేక ఇబ్బందులు పడుతూ వచ్చినా ఇప్పడైనా న్యాయం చేయరా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

**సుడా చైర్మన్ నియామకంతో సరి** : కరీంనగర్ జిల్లాకు సంబంధించి శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (సుడా) ఛైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నియామకం ఉత్తర్వు ఒక్కటే వెలువడింది. పాలక మండలి కూడా లేకుండా ఈ ఛైర్మన్ పదవిని భర్తీ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వగా ఈ వ్యవహారం జిల్లాలోని ఇద్దరు మంత్రుల మధ్య తీవ్ర విభేదాలకు దారి తీసింది. నరేందర్‌రెడ్డికి పదవి దక్కేలా శ్రీధర్‌బాబు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చక్రం తిప్పారని, తనను సంప్రదించకుండా ఈ నియామకాన్ని చేయించారని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్రుగా ఉన్నారు. సుడా చైర్మన్ నియామకమైన నాటి నుంచి ఇప్పటి వరకు పొన్నం ప్రభాకర్ నరేందర్‌రెడ్డి కలిసి ఒకే వేదికమీద పాల్గొన్న దాఖలాలు లేవు. వీరిద్దరి మధ్య మర్యాదపూర్వక బేటీ కూడా జరగక పోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే మిగతా నామినేటెడ్ పదవుల భర్తీ జరగడం లేదు కావచ్చనే అభిప్రాయాలు పార్టీలు నేతల్లో వ్యక్తమవుతున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, ఆర్టీఏ మెంబర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, దేవాలయ కమిటీల పాలక మండళ్లు, తదితర అనేక పదవులు భర్తీ చేయడానికి అవకాశాలు ఉన్నా తీవ్ర జాప్యం జరుగుతుండడంపై నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ మధ్య ఏలాంటి విభేదాలు లేవని గాంధి భవన్‌లో బహిరంగ ప్రకటన చేసిన మంత్రులు దానిని నిరూపించుకోవడానికి వెంటనే కలిసి కట్టుగా చొరవ తీసుకుని నామినేటెడ్ పదవుల భర్తీని పూర్తి చేయించాలని ద్వితీయ శ్రేణి నేతలు కోరుతున్నారు.

# మూసీ ప్రక్షాళనకు హరీశ్, కేటీఆర్ మోకాలడ్డు

## వారిద్దరూ మూసీ వద్ద నెల రోజులు కిరాయికి ఉంటే పేదల బాధలు తెలుస్తాయి

## రోడ్లు, భవనాలశాఖ మంత్రి వెంకట్‌రెడ్డి




దేవరకొండ, : మూసీని ప్రక్షాళన చేసి రోగాల బారిన పడకుండా ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కేటీఆర్‌లు అడ్డుపడుతున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. వారిద్దరూ నెల రోజులు మూసీ వద్ద ఇల్లు కిరాయి తీసుకుని ఉంటే పేదలు పడే బాధలు తెలుస్తాయని విమర్శించారు. ఎవరు అడ్డొచ్చినా మూసీ ప్రక్షాళన చేసి తీరతామన్నారు. హరీశ్‌రావు మూసీని అడ్డుకునేందుకు ఢిల్లీకి వెళ్లి రాహుల్‌గాంధీ ఇంటి వద్ద ధర్నా చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు.

నల్లగొండ జిల్లా దేవరకొండ, మాల్ నూతన మార్కెట్‌కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పదేళ్లలో శ్రీశైలం సొరంగమార్గాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. రూ. 2వేల కోట్లు కేటాయిస్తే సొరంగమార్గం ఎప్పుడో పూర్తయ్యేదన్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లు కేటాయించారని, సొరంగమార్గానికి నిధులు కేటాయించాలని అడిగినా పట్టించుకోని దుర్మార్గుడు కేసీఆర్ అని విమర్శించారు. తమ ప్రభుత్వం 30 నెలల్లో శ్రీశైలం సొరంగమార్గాన్ని పూర్తి చేసి నల్లగొండ జిల్లా ప్రజలకు సాగునీరు అందిస్తుందని చెప్పారు. వారంలోగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

భువనగిరి : తెలంగాణ సంస్కతీ సంప్రదాయాలకు బతుకమ్మ పం దుగ ప్రతీక అని జిల్లా పరిషత సీఈవో ఎన.శోభారాణి అన్నారు.

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత కార్యాలయ ఆవరణలో జిల్లా పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె బతుకమ్మ ఆడారు. బతుకమ్మతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం బతుకమ్మలను భువనగిరి శివారులోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారిని సుభాషిణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హైడ్రాకూ ఓ మొబైల్ యాప్

- **చెరువులు, ప్రభుత్వ స్థలాలపై నిఘా**
- **త్వరలో అందుబాటులోకి అప్లికేషన్**
- **ఆక్రమణలపై ఫిర్యాదుచేసేలా రూప కల్పన**
- **చెరువుల పూర్వవైభవానికి హైడ్రా ప్రణాళిక**



హైదరాబాద్ : మహా నగరంలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలపై నిరంతర నిఘాకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) చర్యలు తీసుకుంటోంది. ఆక్రమణలపై పౌరులు ఫిర్యాదు చేసేలా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కసరత్తులు చేస్తోంది. ఇక నుంచి కబ్జాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకునేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు సోమవారం జరిగిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.

ఆక్రమణల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు యాప్‌ను రూపొందించాలని హైడ్రా నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆక్రమణల ఫొటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా ఫిర్యాదు నమోదవుతుంది. సంబంధిత ప్రాంత బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాయి. యాప్ రూపకల్పన బాధ్యతలను ఓ ఏజెన్సీకి అప్పగించినట్టు హైడ్రా వర్గాలు పేర్కొన్నాయి. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గుర్తింపునకు రెవెన్యూ, ఇరిగేషన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఎన్ఆర్ఎసఏ), స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్(ఎసఆర్ఎసీ), సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో చర్చించారు. నాలుగైదు దశాబ్దాల క్రితం, ప్రస్తుతం చెరువుల విస్తీర్ణానికి సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను అందించాలని ఎన్ఆర్ఎసఏ, ఎస్ఆర్ఎసీ అధికారులను కోరారు.

**చెరువులకు పూర్వ వైభవం తెస్తాం: రంగనాథ్**

చెరువుల పరిరక్షణతో పాటు వాటికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు హైడ్రా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఆక్రమణలు కూల్చివేసిన చెరువుల్లో వ్యర్థాలను తొలగించి, పనులు చేపడతామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మొదటి దశలో సున్నం, అప్పా, ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్లచెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఔటర్ లోపల ఎన్ని చెరువులున్నాయి..? ఎంత మేర ఆక్రమణలకు గురయ్యాయి..? అన్న లెక్కలూ తేల్చుతామని వెల్లడించారు.

శాస్త్రీయ పద్ధతుల ద్వారా ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని, గతంలో నిర్ధారించిన ఎఫ్‌టీఎల్ సరిగా లేని పక్షంలో వాటిని సవరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్ఆర్ఎసఏ, ఎస్ఆర్ఎసఏ, ఇరిగేషన్ విభాగాల నుంచి 45ఏళ్ల డేటాను సేకరిస్తామని, దాని ఆధారంగా చెరువుల ఎఫ్‌టీఎల్‌ను గుర్తిస్తామని చెప్పారు. హిమాయత్‌సాగర్‌తో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ గుర్తింపును ప్రారంభించి అదే విధానాన్ని అన్ని చెరువుల విషయంలో పాటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువుల ఆక్రమణలపై 2018లో కాగ్ ఇచ్చిన నివేదికను పరిశీలించడంతోపాటు.. ఆక్రమణల గుర్తింపులో పొరపాట్లు లేకుండా చూస్తామన్నారు.

# చెరువుల్లో 386 ఎకరాలు మాయం!

- **హైదరాబాద్‌లో 44 నీటి వనరులు పూర్తిగా కనుమరుగు**
- **మరో 127 చోట్ల పెద్దమొత్తం విస్తీర్ణంలో ఆక్రమణలు**
- **పదేళ్లలో భారీగా కబ్జాలు!.. బీఆర్ఎస్ నేతలే అధికం!**
- **మరికొన్నిచోట్ల ప్రతిపక్ష స్థానిక నాయకుల హస్తం**
- **ఔటర్ వరకు 695 చెరువులున్నట్లు గుర్తింపు**
- **ప్రభుత్వ రికార్డులు, ఉపగ్రహ చిత్రాల ద్వారా పరిశీలన**



హైదరాబాద్ : హైదరాబాద్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లో అంతులేని ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. ప్రత్యేకించి గడిచిన పదేళ్లకాలంలో అత్యధికంగా చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు వరకు మొత్తం 695 చెరువులు ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతుండగా.. ఇందులో 2014 నుంచి 2023 మధ్య కాలంలోనే 44 చెరువులు పూర్తిగా కబ్జాలకు గురై కనుమరుగయ్యాయి. మరో 127 చెరువుల్లో పెద్ద మొత్తం విస్తీర్ణం ఆక్రమణల పాలైంది. మొత్తంగా ఆయా చెరువులన్నింట్లో కలిపి గత పదేళ్లలో 386.71 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు తేల్చారు. వీటిలో శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు వెలిశాయి.

రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డులతోపాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) వద్ద తీసుకున్న శాటిలైట్ చిత్రాల ద్వారా చెరువుల స్థితిని అధికారులు పరిశీలించారు. అక్షాంశం, రేఖాంశం ఆధారంగా ఒక్కో చెరువు 2014 వరకు ఎంత విస్తీర్ణంలో ఉంది, ప్రస్తుతం ఎన్ని ఎకరాల్లో ఉందనేది అంచనా వేశారు. తద్వారా ఆక్రమణల లెక్క తేల్చారు. అభివృద్ధి విస్తరణ క్రమంలోనే ఈ ఆక్రమణలు జరుగుతూ.. చెరువులు, కుంటలు కనుమరుగవుతున్నట్లు స్పష్టమవుతోంది. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంలోనే ఈ ఆక్రమణల తంతు మొదలైనా.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత కూడా ఇది ఆగలేదు. పైగా, అంతకన్నా ఎన్నో రెట్లు పెరిగింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు అంగుళం ఆక్రమణకు కూడా గురికాని 77 చెరువుల్లో.. 20 చెరువులు గత పదేళ్లలో పూర్తిగా కనుమరుగు కావడమే ఇందుకు నిదర్శనం. మరో 57 చెరువులు పాక్షికంగా కబ్జా చెరలో చిక్కాయి. వీటికితోడు.. గతంలో కొంత విస్తీర్ణం మేరకు ఆక్రమణకు గురైన 94 చెరువుల్లో 24 చెరువులు ఈ పదేళ్లలో పూర్తిగా కనుమరుగయ్యాయి. మరో 70 చెరువుల్లో ఆక్రమణలు పెరిగిపోయాయి.

**2014 తరువాతే పెద్దమొత్తంలో కబ్జా..**

ప్రభుత్వ రికార్డుల ప్రకారం.. 2014 వరకు 499 చెరువుల్లో ఎలాంటి ఆక్రమణలు లేవని, ఆ తరువాతి కాలంలోనే కబ్జాకు

తెర లేచిందని అధికారులు పేర్కొంటున్నారు. రియల్ బూమ్ పెరగడం, భూముల ధరలు రూ.కోట్లలో పలుకుతుండడంతో ఆక్రమణలు చోటుచేసుకున్నాయని అంటున్నారు. మట్టి పోసి చదును చేసి, కొన్ని చోట్ల ప్లాట్లు చేసి విక్రయిస్తే.. ఇంకొన్ని చోట్ల తాత్కాలికంగా షెడ్లు వేసి, అనంతరం పక్కా భవనాలు నిర్మించారు. శిఖం పట్టా భూముల్లో నిర్మాణాలు చేపట్టే అవకాశం లేకపోయినా.. యథేచ్ఛగా భవనాలు వెలిశాయి. అయినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఆక్రమణలకు పాల్పడ్డవారిలో ఎక్కువగా అప్పటి అధికార బీఆర్ఎస్ నేతలు ఉండగా, కొన్నిచోట్ల స్థానిక కాంగ్రెస్, బీజేపీ నేతలూ ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో స్థానికులు ఫిర్యాదు చేసినా.. ఒత్తిళ్ల వల్లనో, అక్రమార్జన వల్లనో అధికారులు స్పందించలేదు. దీంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోయారు.

ఆక్రమించిన స్థలాలను ప్లాట్లుగా విక్రయించడంతోపాటు కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించి విక్రయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకు లభిస్తుండడంతో పేద, దిగువ మధ్య తరగతి వర్గాలు సొంతింటి కల నెరవేర్చుకునేందుకు వీటిని కొనుగోలు చేశాయి. కబ్జా చేసినవారు సొమ్ము చేసుకొని బయటపడగా.. వాటిని కొనుక్కున్నవారు మాత్రం ప్రస్తుతం ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో బాధితులుగా మారుతున్నారు.

2014 వరకు ఆక్రమణలు లేకుండా..

ఆ తరువాత పూర్తిగా కనుమరుగైన చెరువుల్లో కొన్ని

పుప్పాలగూడ 9.25 ఎకరాలు

బుద్వేల్ 6.39 ఎకరాలు

బాచుపల్లి 2.1 ఎకరాలు

కుంట్లూరు 1.62 ఎకరాలు

2014 నాటికి 2014 నుంచి 2023 వరకు

చెరువుల పరిస్థితి పూర్తిగా పాక్షికంగా

కనుమరుగైనవి కబ్జాకు గురైనవి

ఆక్రమణలు లేని చెరువులు 499 20 57

పాక్షిక ఆక్రమణకు గురైనవి 196 24 70

మొత్తం 695 44 127

2014 వరకు ఆక్రమణలు లేకుండా..

ఆ తరువాత పాక్షిక ఆక్రమణలు జరిగిన చెరువుల్లో కొన్ని (బ్రాకెట్లో పూర్తి విస్తీర్ణం)

మల్లాపూర్ 11.58 ఎకరాలు (19.75)

మక్తల్ కుంట, పెద్ద అంబర్‌పేట 9.48 ఎకరాలు (12.09)

దేవరయాంజల్ 9.19 ఎకరాలు (22.24)

సురోని చెరువు, మంఖాల్ 8.88 ఎకరాలు (51.96)

ఉమ్దాసాగర్, జల్‌పల్లి 7.84 ఎకరాలు (113.25)

బ్రాహ్మణ కుంట, గోధుమకుంట 6.52 ఎకరాలు (15.22)

సుమర్ చెరువు 5.31 ఎకరాలు (62.51)

మల్కం చెరువు, ఉప్పర్‌పల్లి 4.79 ఎకరాలు (22.14)

నాగారం నాచిన్ 4.11 ఎకరాలు (26)

# ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం




మోత్కూరు, : నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ విమర్శించారు. మండలంలోని పాలడుగు గ్రామంలో జరిగిన పార్టీ మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర తగ్గినా కేంద్ర ప్రభుత్వం, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం లేదన్నారు. పండుగల పూట నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగడంతో పేద, మధ్య తరగతి ప్రజల్లో పండుగల సంతోషమే లేకుండాపోయిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పసునూరు చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేషం, జిల్లా కమిటి సభ్యుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు పైళ్ల రాంరెడ్డి, రాములమ్మ, దడిపల్లి ప్రభాకర్, రమేష్, యాదయ్య, ముత్తమ్మ, కృష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.

# కొత్త ఆర్ఓఆర్ చట్టంతో ధరణి సమస్యలకు పరిష్కారం

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



కడ్తాల్ , : బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 'ధరణి' ద్వారా రైతులు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా కొత్త ఆర్ఓఆర్ చట్టం తీసుకురాబోతుందని రెవెన్యూ, గృహని ర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలో డీఎంఎఫటీ నిధుల నుంచి రూ.1.18 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలోని 75 మంది గీతకార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను, 77 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడుతూ కడ్తాల మండలంలో 3200 ధరణి భూ సమస్యలు ఉండగా, ప్రస్తుతం 550 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలినవి రెండు మూడు వారాల్లో పరిష్కరిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ సందర్భంగా కల్వకుర్తిలో సీఎం రేవంత్ మంజూరు చేసిన నిధులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. కడ్తాలలో ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. టీయూఎఫఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనను చూసి ఓర్వలేని విపక్షాలు విషం కక్కుతున్నాయని మండిపడ్డారు. కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి** కల్వకుర్తి నియోజకవర్గానికి 10 వేల ఇళ్లు మంజూరు, మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, జూనియర్ కళాశాల ఏర్పాటు, ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టు భర్తీ, మండల పరిషత్ భవనం, ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణం, భూ సమస్యలు, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు తదితర సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, ఆర్డీవో అనంత రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, ప్రత్యేక అధికారి రామేశ్వరి దేవి, ఎంపీడీవో సుజాత, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, మాజీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు శ్రీపాతి శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాసగౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ పాల్గొన్నారు.

# త్వరలో హీరో విజయ్ రాష్ట్రవ్యాప్త పర్యటన

## జయం మనదేనంటూ పార్టీ శ్రేణులకు లేఖ



చెన్నై: విక్రవాండి వద్ద నిర్వహించిన తొట్టతొలి మహానాడు విజయవంతం కావటంతో రెట్టింపు ఉత్సాహంతో తమిళగ వెట్రి కళగం నేత, సినీ హీరో విజయ్ త్వరలో రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నారు. మహా నాడు విజయవంతమయ్యేందుకు కృషిచేసిన పార్టీ నేతలం దరికీ ఆయన ధన్యవాదాలు తెలుపుతూ ఓ లేఖ రాశారు. మాజీ ముఖ్యమంత్రి అన్నాదురైలా తాను పార్టీ శ్రేణులకు తరచూ లేఖలు రాసి వారిలో ఉత్సాహాన్ని నింపాలని నిర్ణయిం చుకున్నానని విజయ్ పేర్కొన్నారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం ఖాయమని, ఆ దిశగా పార్టీ శ్రేణులంతా పాటుపడాలని పిలుపునిచ్చారు.

ఇక దీపావళి తర్వాత 234 శాసనసభ నియోజకవర్గాలలో సుడిగాలి పర్యటన జరిపేందుకు విజయ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతినియోజకవర్గంలో నాలుగైదు చోట్ల రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించారు. దీపావళి తర్వాత పార్టీ ప్రముఖులు, నాయకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. విజయ్ ప్రస్తుతం హెచ్ వినోద్ దర్శకత్వంలో నటిస్తున్న 69వ చిత్రం షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. పదిరోజులపాటు ఆ సినిమా షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. మరో రెండు మూడు రోజుల్లో ఆయన సినిమా షూటింగ్‌కు వెళ్ళనున్నారు.

మే నెలాఖరువరకు ఆ సినిమా షూటింగ్ జరుగుతుందని తెలుస్తోంది. ఆ షూటింగ్ గ్యాప్‌లో ఆయన పార్టీ వ్యవహారాలపై దృష్టిసారించనున్నారు. సినిమా షూటింగ్ పూర్తికాగానే ఆయన పూర్తిగా రాజకీయాలకే అంకితమవుతారని అనుచరులు చెబుతున్నారు. ఓ వైపు డీఎంకేని, మరో వైపు జాతీయ పార్టీ బీజేపీపై మహానాడులో దుమెత్తిపోసిన విజయ్.. అన్నాడీఎంకే తో దోస్తీకడతారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఆ దిశగానే రెండు పార్టీల నాయకులు రహస్యంగా మంతనాలు కూడా చేస్తున్నారని తెలుస్తోంది.

మహానాడులో తమ పార్టీని విమర్శించకపోవడం వల్ల అన్నాడీఎంకే కూటమిలో విజయ్ పార్టీ చేరటం ఖాయమేనని డీఎంకే, దాని మిత్రపక్షాలు కూడా చెబుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికల సమయంలో పొత్తులపై దృష్టిసారించవచ్చునని, అంతకంటే ముందు రాష్ట్రప్రజలను నేరుగా కలుసుకోవాలని విజయ్ నిర్ణయించారు. ఆ దిశగానే దీపావళి తర్వాత ప్రధానంగా నియోజకవర్గాల వారీ పర్యటనపైనే దృష్టిసారించనున్నారు.

# వృద్ధులకు 5లక్షల ఆరోగ్య బీమా

## దేశవ్యాప్తంగా 70ఏళ్లు దాటిన వారందరికీ అందుబాటులోకి




న్యూఢిల్లీ, అక్టోబరు 29: దేశవ్యాప్తంగా 70ఏళ్ల వయసు దాటిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ధన్వంతరి జయంతి, 9వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ)లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) కింద తీసుకొచ్చిన ఈ సదుపాయాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. అలాగే ఆరోగ్య రంగంలో రూ.12,850 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులతో పాటు గర్భిణులు, చిన్నారుల వ్యాక్సినేషన్ కోసం ఉద్దేశించిన యూ-విన్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. తాజా పథకం ద్వారా దేశవ్యాప్తంగా 4.5 కోట్ల కుటుంబాల్లోని 6కోట్ల మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా. పేద, ధనిక భేదాలు లేకుండా అన్ని వర్గాల వారికి ఈ బీమా వర్తిస్తుంది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నవారికి కొత్త కార్డులు అందిస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఉన్నవారికి మరో రూ..5లక్షల అదనపు టాప్-అప్ కవరేజీ లభిస్తుంది. (ఈ మొత్తాన్ని వారు కుటుంబంలో 70ఏళ్ల కంటే తక్కువ వయసున్న ఇతర సభ్యులతో పంచుకోవాల్సిన అవసరం లేదు.). ప్రైవేటు వైద్య ఆరోగ్య బీమా, ఈఎస్ఐసీ కింద ప్రయోజనం పొందుతున్నవారు కూడా ఈ పథకం కింద ప్రయోజనం పొందడానికి అర్హులు. సీజీహెచ్ఎస్, ఎక్స్-సర్వీసమన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు ఫోర్స్ పథకాల్లో ఉన్న వృద్ధులు వాటిని గానీ ఏబీ-పీఎంజేఏవైని గానీ ఎంచుకోవచ్చు. దీనికోసం పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలి. కాగా, ఆయుష్ రంగ విస్తరణలో భాగంగా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద రెండో దశను ప్రధాని ఈ సందర్భంగా ప్రారంభించారు. దీనిలో అత్యాధునిక పంచకర్మ ఆసుపత్రి, ఆయుర్వేద ఫార్మసీ, స్పోర్ట్స్ మెడిసిన్ యూనిట్, సెంట్రల్ లైబ్రరీ, ఐటీ, స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్, 500 సీట్ల ఆడిటోరియంను నిర్మిస్తారు. ఇండోర్‌లో నూతన ఈఎస్ఐసీ ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు ఫరీదాబాద్ (హరియాణా), బొమ్మసంద్ర, నరసాపూర్(కర్ణాటక), మీరట్(ఉత్తర ప్రదేశ్), అచ్యుతాపురం(ఏపీ), ఇండోర్‌లలో అదనపు ఈఎస్ఐసీ ఆసుపత్రులక నిర్మాణానికి శంకుస్థాపన

చేశారు. వీటితో పాటు ఎయిమ్స్ రుషీకేశ్, బీబీనగర్, గువాహటి, భోపాల్, జోధ్‌పూర్ సహా 11 ప్రధాన సంస్థల్లో డ్రోన్ ఆధారిత సేవలను ప్రధాని ప్రవేశపెట్టారు. అలాగే ఎయిమ్స్ రిషీకేశ్‌లో హెలికాప్టర్ అత్యవసర వైద్యసేవలను ప్రారంభించనున్నారు.

**అచ్యుతాపురం సెజ్‌లో ఈఎసఐ ఆస్పత్రి** : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజడ్‌లో ఈఎసఐ ఆస్పత్రి నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ మాట్లాడుతూ.. ఈఎసఐ ఆస్పత్రిని కేంద్రం గతంలోనే మంజూరు చేసిందని, కానీ జగన్ ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టలేదని విమర్శించారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు.

**యువత ఉపాధికి ప్రత్యేక వ్యవస్థ** : దేశంలో ప్రతి యువకుడు/యువతికి ఉపాధి కల్పించే సరికొత్త ప్రత్యేక వ్యవస్థను సృష్టిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. యవతకు గరిష్ఠ సంఖ్యలో ఉద్యోగాలు సమకూర్చాలన్నది తన ప్రభుత్వ ధ్యేయంగా పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన 'రోజ్‌గార్ మేళా'లో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 51 వేల మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2022లో ఈ మేళా పథకాన్ని ప్రారంభించామని.. రెండేళ్లలోనే ఇప్పటివరకు 7.5 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ పర్యవేక్షణలో లక్షన్నర స్టార్టప్‌లు ప్రారంభించామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోటి మంది యువతను చేర్చుకోవడానికి పెయిడ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం చేపట్టామని ప్రస్తావించారు. ప్రధాని ఈ సందర్భంగా ప్రజలకు ధన త్రయోదశి శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఈ దీపావళి పర్వదినం ప్రత్యేకం కాబోతోంది. ఎందుకంటే 500 ఏళ్ల తర్వాత అయోధ్య దివ్య దేవాలయంలో శ్రీరాముడిని ప్రతిష్ఠించిన తొలి సంవత్సరమిది' అని వ్యాఖ్యానించారు.

# రక్త నమూనాలు తీసుకొచ్చిన డ్రోన్..!

- **9 నిమిషాల్లో 12 కి.మీ. ఎగిరెళ్లి నలుగురి శాంపిల్స్ స్వీకరణ**
- **మంగళగిరి ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు ప్రారంభం**
- **ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ**



మంగళగిరి, : వైద్యరంగంలో కూడా డ్రోన్ సేవల వినియోగం పెరిగింది. ఈ డ్రోన్ టెక్నాలజీని మరింత విస్తృతంగా వాడుకోవాలని కేంద్రం నిర్ణయించింది. మంగళవారం ఢిల్లీలోని ఎయిమ్స్ నుంచి ప్రధాని మోదీ.. దేశవ్యాప్తంగా 11 ఎయిమ్స్ ఆస్పత్రుల్లో డ్రోన్ సేవలను ప్రారంభించారు. దీంతో మంగళగిరి ఎయిమ్స్‌లో కూడా డ్రోన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. తొలిసారి ఇక్కడ మొదలైన డ్రోన్ సేవలను ఆస్పత్రి అధికారులు పరిశీలించారు. ఎయిమ్స్ ఆస్పత్రి నుంచి సుమారు 12 కిలోమీటర్ల దూరంలోని నూతక్కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో చికిత్స పొందుతున్న గర్భిణీ వల్లంశెట్టి నాగదివ్యతో పాటు మరో ముగ్గురి నుంచి సేకరించిన రక్త నమూనాలను తెచ్చేందుకు డ్రోన్‌ను పంపించారు. ఇది 9 నిమిషాల్లోనే నూతక్కి చేరుకుని నమూనాలను రెండు నిమిషాల్లో స్వీకరించి.. తిరిగి 9 నిమిషాల్లో ఎయిమ్స్‌కి చేరుకుంది. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మదుబానందకర్ మాట్లాడుతూ... ఆరోగ్యరంగంలో డ్రోన్ టెక్నాలజీని వినూత్నంగా ఉపయోగించే ఉద్దేశంతో ఈ సేవలు ప్రారంభించామని చెప్పారు.

# పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోని వృద్ధులకు క్షమాపణలు తెలియజేసిన ప్రధాని మోదీ



డెబ్బై ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత హాస్పిటల్ సంరక్షణ సౌకర్యాన్ని అందించే 'ఆయుష్మాన్ భారత్' స్కీమ్‌ను అమలు చేయని పశ్చిమ బెంగాల్, ఢిల్లీలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ పథకాన్ని అమలు చేయలేకపోతున్నందున క్షమించాలని పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోని వృద్ధులను ఆయన కోరారు. 70 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఏడాదికి రూ.5 లక్షల వరకు హెల్త్ కవర్ ఉంటుందని ఆయన ప్రస్తావించారు. పలు హెల్త్ సంబంధిత ప్రాజెక్టులను ప్రారంభం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2018లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం ద్వారా పేద, మధ్యతరగతితో పాటు ధనిక కుటుంబాలకు చెందిన వృద్ధులు కూడా ప్రయోజనం పొందవచ్చని అన్నారు.

పథకం కింద పేర్లు నమోదు చేసుకున్న వృద్ధులకు 'ఆయుష్మాన్ వయ వందన కార్డు' వస్తుందని, తద్వారా ప్రభుత్వ లేదా సూచించిన ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచిత చికిత్సకు అర్హులు అవుతారని వివరించారు. వృద్ధుల ఆరోగ్యంపై కుటుంబాల ఖర్చును తగ్గించేందుకు ఈ పథకం దోహదపడుతుందని మోదీ గుర్తుచేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకంలో చేరకపోవడంతో బెంగాల్, ఢిల్లీలోని వృద్ధులు ఈ ప్రయోజనాలను పొందలేరని అన్నారు. రాజకీయ స్వప్రయోజనాల కోసం అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులను అణచివేస్తున్నారంటూ పశ్చిమ బెంగాల్, ఢిల్లీ ప్రభుత్వ పెద్దలను మోదీ విమర్శించారు.

కాగా మోదీ వ్యాఖ్యలకు పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్, ఢిల్లీలో అధికారంలో ఆప్ పార్టీలు కౌంటర్లు ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ స్పందిస్తూ.. బెంగాల్ ప్రభుత్వం అమలు చేస్తున్న స్వాస్థ్య సతి పథకాన్ని కేంద్రం కాపీ కొట్టి ఆయుష్మాన్ భారత్‌గా అమలు చేస్తోందని అన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకాని కంటే రెండు సంవత్సరాల ముందే స్వాస్థ్య సతి పథకం ప్రారంభమైందని అన్నారు. 100 శాతం పేపర్‌లెస్, క్యాష్‌లెస్ అని డెరెక్ అన్నారు. తమ పథకంలో వ్యాధులన్నీ కవర్ అవుతాయని, కుటుంబంలో ఇంతమందికే అనే పరిమితి ఉండదని పేర్కొన్నారు.

ఇక ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ కూడా మోదీకి కౌంటర్ ఇచ్చారు. ఆయుష్మాన్ భారత్ పథకం సాధారణ ప్రజలకు అందించలేని విధంగా కఠినమైన నిబంధనలు ఉన్నాయని అన్నారు. "ఇంట్లో రిఫ్రిజిరేటర్ ఉంటే ఆయుష్మాన్ భారత్ ప్రయోజనాలకు అర్హులు కాదు. బైక్ ఉన్నా లేదా నెలవారీ ఆదాయం రూ.10,000 కంటే ఎక్కువగా ఉన్న ఈ పథకం నుంచి మినహాయిస్తారు. ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసినా ఈ నిర్బంధ నిబంధనల కారణంగా ఒక్క ఢిల్లీ నివాసి కూడా ప్రయోజనం పొందలేదు" అని ఆయన వ్యాఖ్యానించారు.

# సరికొత్త వ్యూహంతో బీజేపీ...ప్రచారం



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల గడువు ముగియడంతో ఎన్నికల ప్రచారం ఒక్కసారిగా ఊపందుకుంటోంది. మహాయుతి కూటమి, మహా వికాస్ అఘాడి తమ అగ్రనేతలను ప్రచారబరిలోకి దింపుతున్నాయి. 50కి పైగా బహిరంగ సభల్లో బీజేపీ అగ్రనేతలు పాల్గొనేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు ఈ బహిరంగ సభల్లో పాల్గొంటారు.

మోదీ ఎక్కడ, ఎన్ని..? ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెస్ట్ మహారాష్ట్ర, విదర్భ, ముంబై-కొంకణ్, నార్త్ మహారాష్ట్ర, మరాఠ్వాడాల్లో 8 పబ్లిక్ మీటింగ్స్‌లో పాల్గొంటారు. ఎక్కువ పబ్లిక్ మీటింగ్స్‌లో పాల్గొనే బాధ్యత దేవేంద్ర ఫడ్నవిస్, నితిన్ గడ్కరి, చంద్రశేఖర్ బవాంకులేకి అప్పగించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వివిధ జిల్లాల్లో 15 ర్యాలీల్లో పాల్గొంటారు. ఆయనతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. వీటితో పాటు స్థానిక నేతలు సైతం పలు ర్యాలీలు నిర్వహించనున్నారు.

**అత్యధిక ర్యాలీల నిర్వహణ ఫడ్నవిస్‌కే** పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, కేంద్రం మంత్రి అమిత్‌షా 20 ర్యాలీలు, నితిన్ గడ్కరి 40 ర్యాలీలు నిర్వహించనుండగా, దేవేంద్ర ఫడ్నవిస్ 50 ర్యాలీలు నిర్వహిస్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బవాంకులే 40 ర్యాలీలు నిర్వహిస్తారు.

**హర్యానా తరహాలోనే..** హర్యానా ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాన్నే మహారాష్ట్ర ఎన్నికల్లోనూ అనుసరించాలని బీజేపీ వ్యూహంగా ఉంది. హర్యానాలో మోదీ, అమిత్‌షా కొన్ని ర్యాలీల్లోనే పాల్గొని ప్రచారం సాగించారు. ఎక్కువ ర్యాలీలు స్థానిక నేతలే నిర్వహించారు. హర్యానాలో కమలనాథుల వ్యూహం ఫలించింది. ఊహించిన దానికంటే ఎక్కువ సీట్లలో గెలిచి, వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనతను బీజేపీ దక్కించుకుంది.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నవంబర్ 20న జరుగనున్నాయి. నవంబర్ 23న కౌంటింగ్ జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన, అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్‌సీపీతో కలిసి బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే పట్టుదలతో ఉందిఖి. కాగా, మహారాష్ట్రలో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు రాబట్టిన 'మహా వికాస్ అఘాడి' ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయనే నమ్మకంతో ఉంది.

# నేతలు,జడ్జీలు కలవడం మామూలే



న్యూఢిల్లీ, : ముఖ్యమంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు తరచూ కలుసుకోవడం, మాట్లాడుకోవడం మామూలేనని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ఆ సమయంలో న్యాయ సంబంధ విషయాల ప్రస్తావన వారి మధ్య రాదని, అటువంటి సందర్భం తనకు ఒక్కటి కూడా గుర్తు లేదని ఆయన తెలిపారు. తమ ఇంట్లో గణపతి పూజా కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించడంపై రాజకీయ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో... ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరికొద్ది రోజుల్లో పదవీవిరమణ చేయనున్న ఆయన ఈ వివాదంపై లోక్‌సత్తా వార్షిక సమావేశంలో స్పందించారు. "ఎందుకని రాజకీయ నాయకులు, న్యాయ మూర్తులు కలుసుకుంటారో తెలుసుకోవాలని ప్రజలకు ఉంటుంది. అయితే, న్యాయవ్యవస్థతోపాటు రాజకీయ వ్యవస్థ కు కూడా పరిణతి ఉంది. న్యాయ వ్యవస్థకు అవసరమైన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. అది న్యాయమూర్తుల కోసం కేటాయించే బడ్జెట్ కాదు. నూతన కోర్టు భవనాలు, జిల్లాల్లో న్యాయమూర్తులకు కొత్త నివాస సముదాయాల ఏర్పాటు కోసం ఆ బడ్జెట్‌ను వినియోగిస్తారు. ఇలాంటి అవసరాలు తీరాలంటే ప్రధాన న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి కలిసి మాట్లాడుకోవడం అవసరం" అని ఆయన వివరించారు.

"ఆగస్టు 14, జనవరి 26తో పాటు పెళ్లిళ్లు, మరణాలు.. ఇలా సందర్భం ఏదైనా సీఎం, చీఫ్‌జస్టిస్ కలుస్తుంటారు. న్యాయ సంబంధ అంశాలేవీ అక్కడ ప్రస్తావనకు రావు" అని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు. కాగా, గణపతి పూజ కోసం సీజే ఇంటికి ప్రధాని వెళ్లడంపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. శివసేన (యూబీటీ), శివసేన (షిండే) పార్టీల మధ్య వివాదంపై విచారణ నుంచి జస్టిస్ చంద్రచూడ్ తప్పుకోవాలని శివసేన (యూబీటీ) డిమాండ్ చేసింది.

# టీ-శాట్‌లో ఉన్నత విద్య ప్రసారాలు.. అదే వెబ్‌సైట్లో పరీక్షల ఫలితాలు

## ఉన్నత విద్యా మండలి అధ్యక్షుడు బాల కృష్ణారెడ్డి

హైదరాబాద్, : ఉన్నత విద్య ప్రసారాలను టీ–శాట్ ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య వి.బాల కృష్ణారెడ్డి తెలిపారు. తెలంగాణలోని ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యను టీ–శాట్ ద్వారా అందించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. అంబేద్కర్ వర్సిటీ ప్రాంగణంలోని టీ–శాట్ కార్యాలయాన్ని ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఈ.పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌తో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. టీ–శాట్ పనితీరు.. ప్రాథమిక, ఇంటర్ విద్య, పోటీ పరీక్షలు, ఇతర విభాగాలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో బాల కృష్ణారెడ్డి బృందానికి టీ–శాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి వివరించారు.

భవిష్యత్తులో నాణ్యమైన డిజిటల్ కంటెంట్‌ను ఉన్నత విద్యనభ్యసించే వారికి అందించే విధంగా ఉమ్మడి ప్రణాళికను సిద్ధం చేసుకుందామని, ప్రవేశ పరీక్షల ఫలితాలను టీ–శాట్ వెబ్‌సైట్ ద్వారా విడుదల చేయాలని వేణుగోపాల్ రెడ్డి కోరగా.. బాల కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉన్నత విద్యకు సంబంధించి 52 మాడ్యూల్స్ కంటెంట్ అందుబాటులోకి తెచ్చే విధంగా ఏరాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా బాల కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# వచ్చే ఏడాది జనగణన

- 2025 మొదట్లో షురూ.. 2026లో పూర్తి.. ఆ తర్వాత లోక్‌సభ సీట్ల పునర్విభజన
- రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ పదవీకాలం ఆగస్టు దాకా పొడిగింపు
- అఖిలపక్ష భేటీ నిర్వహణకు కాంగ్రెస్ డిమాండ్



న్యూఢిల్లీ, : చాలాకాలంగా ఆలస్యమవుతూ వస్తున్న జనగణన ప్రక్రియను కేంద్రం వచ్చే ఏడాది మొదట్లోనే చేపట్టి.. 2026కల్లా జాతీయ జనాభా పట్టికను నవీకరించి, ఆ వివరాలను ప్రజలకు వెల్లడించే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే, విపక్షాలు డిమాండ్ చేస్తున్న కుల గణన విషయంపై మాత్రం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో జనగణన చక్రం 2035, 2045.. అలా మారుతుందని ఆ వర్గాలు వివరించాయి. వచ్చే ఏడాది చేపట్టే జనగణన పూర్తయ్యాక.. 2026లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశం ఉంది. కాగా.. 1951 నుంచి ప్రతి పదేళ్లకొకసారి మనదేశంలో జనగణన జరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే, 2021లో కరోనా కారణంగా జరగలేదు. అప్పట్నుంచీ ఆలస్యమవుతూ వస్తోంది. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సహా పలు పార్టీలు ఈసారి కులగణన కూడా చేపట్టాలని, దానివల్ల దేశంలో ఓబీసీ జనాభా ఎంతో తెలుస్తుందని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

**స్పష్టత ఇవ్వండి..** జనగణనకు సంబంధించిన కసరత్తు మొదలైందన్న వార్తలతోపాటు.. రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియాగా వ్యవహరిస్తున్న మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ పదవీకాలాన్ని 2026 ఆగస్టు దాకా పొడిగించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. జనాభా లెక్కలను సేకరించే ప్రక్రియలో భాగంగా కులగణన చేపడతారా? లేదా? వివిధ రాష్ట్రాల లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి ఈ సెన్సస్ వివరాలను ఉపయోగించుకుంటారా? అనే రెండు కీలక అంశాలపై స్పష్టత ఇవ్వాలని, ఇందుకోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. ఒకవేళ ఈ లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరిపితే అది.. కుటుంబనియంత్రణను సమర్థంగా పాటించిన రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కాదా? అని ఆయన ప్రశ్నించారు.

# ఉక్రెయిన్ - రష్యా చర్చలు భారత్‌లోనే..

- అయితే మా షరతుల ప్రకారం జరగాలి
- యుద్ధాన్ని నరేంద్ర మోదీ ఆపగలరు !
- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్య



న్యూఢిల్లీ, : తమ దేశంపై రష్యా యుద్ధాన్ని ఆపేందుకు భారత ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆకాంక్షించారు. ఈ సంక్షోభాన్ని ఆయన ఆపగలరని వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ సోమవారం ఓ జాతీయ ఆంగ్ల పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'జనాభా, ఎకానమీ, పలుకుబడి, ప్రభావపరంగా భారత్ అతిపెద్ద దేశం. అంత పెద్ద దేశానికి మోదీ ప్రధానిగా ఉన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆయరు ఆపగలరు. తదుపరి శాంతి చర్చలు ఇండియాలో జరుగుతాయని ఆశిస్తున్నాను. యుద్ధాన్ని ఆపే ప్రయత్నాలు మోదీ కచ్చితంగా చేయగలరు. చర్చలకు అందరం సన్నద్ధం కావాలి. అయితే మేం కోరుకుంటున్న ఫార్మాట్లో అంటే మా షరతుల ప్రకారం ఇవి జరగాలి. ఎందుకంటే యుద్ధం మా భూభాగంలో మాపై జరుగుతోంది' అని తెలిపారు.

తమ ఇంధన మౌలిక వసతులపై రష్యా దాడులు.. తమ భూభాగంలోకి చొచ్చుకొస్తుండడం.. శీతాకాలం సమీపిస్తుండడం.. వంటి పరిణామాలు తమ దేశానికి పెను సవాల్‌గా మారాయని చెప్పారు. అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో అమెరికా సహకారంపై అనిశ్చితి నెలకొందని.. డొనాల్డ్ ట్రంప్ విజయం సాధిస్తే తమకు సైనిక సాయం గందరగోళంలో పడుతుందని అన్నారు. తాము రూపొందించిన 'విజయ ప్రణాళిక', నాటో సభ్యత్వం ఇవ్వాలని కోరడం.. రష్యాతో చర్చల్లో బేరసారాల కోసం కాదని చెప్పారు.

భవిష్యత్‌లో పశ్చిమ దేశాలు తమ అభిప్రాయం మార్చుకోకుండా ఉండేందుకే ఉక్రెయిన్‌ను నాటోలోకి ఆహ్వానించాలని కోరుతున్నామన్నారు. యుద్ధం ఆగిపోవాలని మోదీ ఊరకే మాటలు చెప్పడం కాదని.. నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రష్యా బలవంతంగా 1,000 మంది ఉక్రెయిన్ పిల్లలను తీసుకెళ్లిందని.. వారిని తిప్పిపంపేందుకు ఆ దేశాధ్యక్షుడు పుతిన్‌పై ఆయన ఒత్తిడి తేవాలని కోరారు.

# మేకిన్ ఇండియా' విమానం

- రెండేళ్లలో సీ-295 రవాణా విమానం అందుబాటులోకి.. భవిష్యత్తులో ఎగుమతులు
- మా ప్రభుత్వ చర్యలతో ఐదారేళ్లలో దేశంలో 1000 వరకు రక్షణ స్టార్టప్‌లు
- పదేళ్లలో రక్షణ ఎగుమతులు 30 రెట్లు.. రతన్ టాటా ఉంటే ఎంతో సంతోషించేవారు
- వడోదరలో సీ-295 విమానాల తయారీ కర్మాగారం ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ
- స్పెయిన్ ప్రధానితో కలిసి ప్రారంభం.. మోదీ విజన్‌కు ఇది నిదర్శనం: సాంచెజ్
- వడోదరలోని లక్ష్మీవిలాస్ ప్యాలెస్ వద్ద మోదీ, సాంచెజ్ కరచాలనం



వడోదర, : దేశ రక్షణ రంగంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సైనిక రవాణా విమానాలను తయారు చేసే తొలి ప్రైవేటు కర్మాగారం ప్రారంభమైంది. గుజరాత్ లోని వడోదరలో సీ-295 రవాణా విమానాల తయారీ కేంద్రాన్ని ప్రధాని మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. టాటా సంస్థ భాగస్వామ్యంతో స్పెయిన్‌కు చెందిన ఎయిర్‌బస్ ఈ ఫ్యాక్టరీని నిర్మించింది. ఎయిర్‌బర్ ఇతర దేశాల్లో ఇలాంటి విమానాలను తయారు చేయడం ఇదే తొలిసారి. కర్మాగారం ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఈ పరిశ్రమ భారత్-స్పెయిన్ మధ్య సంబంధాలతో పాటు 'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' మిషన్‌ను బలోపేతం చేస్తుందని చెప్పారు. భారత్-స్పెయిన్ భాగస్వామ్యాన్ని పెడ్రో సాంచెజ్‌తో కలిసి సరికొత్త మార్గంలో తీసుకెళుతున్నామని తెలిపారు. సరికొత్త భారతదేశంలో పని సంస్కృతి ఎంత వేగంగా మారిందనడానికి సీ-295 విమానాల తయారీ కేంద్రం ప్రారంభోత్సవమే నిదర్శనమన్నారు. రెండేళ్ల కిందట ఈ కర్మాగారం నిర్మాణ పనులు ప్రారంభించామని.. ఇప్పుడది విమానాల ఉత్పత్తికి సిద్ధమైందని చెప్పారు. రెండేళ్లలో తొలి విమానం అందుబాటులోకి వస్తుందన్నారు.

భవిష్యత్తులో ఇక్కడ తయారయ్యే విమానాలను ఇతర దేశాలకు ఎగుమతి కూడా చేస్తారన్న విశ్వాసం తనకుందన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం తీసుకున్న పటిష్ఠ చర్యలతో దేశంలో రక్షణ తయారీ రంగం సరికొత్త శిఖరాలకు చేరిందని తెలిపారు. గడిచిన ఐదారేళ్లలో దేశంలో దాదాపు 1000 రక్షణ స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయని.. గత పదేళ్లలో దేశ రక్షణ ఎగుమతులు 30 రెట్లు పెరిగాయని తెలిపారు.

ప్రస్తుతం 100కు పైగా దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తున్నామన్నారు. "ఇటీవల భారత

ముద్దు బిడ్డ రతన్ టాటాను కోల్పోయింది. ఆయన బతికి ఉంటే.. ఈ రోజు ఇక్కడ మన మధ్యే ఉండేవారు. ఎక్కడ ఉన్నా ఆయన ఈ కార్యక్రమాన్ని చూసి సంతోషిస్తారు" అని మోదీ నివాళి అర్పించారు. భారత్‌ను వైమానిక హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మేడిన్ ఇండియా పౌర విమానం కూడా తయారవుతుందని, దానికి ఇలాంటి కర్మాగారాలు దారి చూపుతాయని చెప్పారు.


**మోదీ దూరదృష్టికి ఈ ప్రాజెక్టు నిదర్శనం** : వడోదర కర్మాగారం నుంచి రెండేళ్లలో తొలి సీ-295 విమానం అందుబాటులోకి వస్తుందని స్పెయిన్ ప్రధాని సాంచెజ్ చెప్పారు. భారత్‌ను పారిశ్రామిక పవర్‌హౌస్‌గా మార్చాలని, పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు గమ్యస్థానంగా మార్చాలన్న ప్రధాని మోదీ సంకల్పం, దూరదృష్టికి ఈ ప్రాజెక్టు నిదర్శనమని కొనియాడారు. తమ దేశం భారత్‌కు నమ్మకమైన, వ్యూహాత్మకమైన భాగస్వామి అని చెప్పారు.

టాటా సంస్థ దిగ్గజాలకే దిగ్గజమని కొనియాడారు. టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. రెండేళ్లలోనే తొలి విమానాన్ని అందజేస్తామని ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు. తొలి విమానాన్ని కూడా మోదీ చేతుల మీదుగానే ప్రారంభిస్తామని, అందుకోసం ఆయన సమయం కూడా తీసుకుంటామని చెప్పారు. ఇది రతన్ టాటా కలల ప్రాజెక్టు అన్నారు. ఇది టాటా గ్రూప్‌కే కాదని, యావత్ దేశానికే చరిత్రాత్మకమైన రోజని పేర్కొన్నారు. 56 సీ-295 విమానాల కొనుగోలుకు 2021 సెప్టెంబరులో భారత్ ఎయిర్‌బస్‌తో రూ.21 వేల కోట్ల విలువైన ఒప్పందం చేసుకుంది. ఇందులో 16 విమానాలు ఇప్పటికే భారత్‌కు చేరుకున్నాయి. మిగిలిన 40 విమానాలు వడోదరలోని కర్మాగారంలో తయారు చేస్తారు. ఈ విమానాల్లో 40-45 మంది పారాట్రూపర్లు లేదా 70 మంది పౌరులు ప్రయాణించొచ్చు. 5-10 టన్నుల వస్తువులను రవాణా చేసే సామర్థ్యంతో వీటిని రూపొందిస్తున్నారు. నాగ్‌పూర్‌లో పెట్టాల్సినదాన్ని వడోదరకు తరలించారు టాటా ఎయిర్‌బస్ ప్రాజెక్టుపై విపక్షాలు గుజరాత్‌లోని వడోదరలో మోదీ టాటా ఎయిర్‌బస్ సీ295 విమానాల నిర్మాణ ప్రాజెక్టును ప్రారంభించడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. నిజానికి దీన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఏర్పాటు చేయాల్సి ఉండగా, గుజరాత్‌కు తరలించుకు పోయారని ఆరోపించాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రయోజనాలను కాదని ప్రధాని సూచనల మేరకు ఈ ప్రాజెక్టును గుజరాత్‌కు తీసుకెళ్లారని ఆరోపించారు. ఇందుకు మహారాష్ట్ర ప్రజలు గట్టి సమాధానం ఇస్తారని చెప్పారు.

రోడ్ షో.. కర్మాగారం ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ, సాంచెజ్‌లో వడోదరలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ వరకూ 2.5 కి.మీ. మేర సాగిన ఈ రోడ్ షోలో ఇద్దరు నేతలు ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్‌ను వీరిద్దరూ కలిసి ప్రారంభించారు.

# సిమెంట్ ఫ్యాక్టరీ రద్దుకోసం ప్రజా ప్రయోజన వాజ్యం

రామన్నపేట, : రామన్నపేట ప్రాంతంలో పెట్టబోతున్న కాలుష్యకారక అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాలనిప్రజా పరిరక్షణ ప్రయాజన వ్యాజ్యాన్ని టీడీపీ రాష్ట్ర నాయకులు రాపోలు నర్సింహ, సామాజిక వేత్త గంజి రమేష తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీతో ఈ ప్రాంతం మొత్తం కాలుష్యంతో నిర్వీర్యమయ్యే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. రామన్నపేట ప్రాంత ప్రతి పౌరుడు వ్యక్తిగత వ్యాజ్యాన్ని



ఉపయోగించుకుని ఫ్యాక్టరీ రద్దు అయ్యే విధంగా చూడాలని అన్నారు.

# సచిన్ రికార్డును సమం చేసిన రోహిత్



పూణె: న్యూజిలాండ్ తో టీమిండియా రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి టీమిండియా వికెట్ నష్టానికి 16 పరుగులుచేసింది. అయితే, మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్.. మొదటి ఇన్నింగ్స్‌లో 259 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. అనంతరం ఫస్ట్ ఇన్నింగ్స్‌ను ఆరంభించిన భారత్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (0) డకౌట్‌గా వెనుదిరిగి నిరాశపర్చాడు. టిమ్ సౌథీ బౌలింగ్‌లో రోహిత్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అప్పటికి జట్టు స్కోరు ఒక పరుగు మాత్రమే. తొలి రోజు ఆట ముగిసే సమయానికి టీమ్‌ఇండియా 16/1 స్కోరుతో ఉంది. శుభ్‌మన్ గిల్ (6 బ్యాటింగ్ ), యశస్వి జైస్వాల్ (10 బ్యాటింగ్) నాటౌట్‌గా క్రీజులో ఉన్నారు. భారత్ ఇంకా 243 పరుగుల వెనుకంజలో ఉంది.


# సంచలన బౌలింగ్‌తో రికార్డు సృష్టించిన వాషింగ్టన్ సుందర్




భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా పుణే వేదికగా జరుగుతున్న రెండవ టెస్టు తొలి రోజున భారత స్టార్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ అదరగొట్టిన విషయం తెలిసిందే.

మ్యాజికల్ స్పెల్ వేసి పర్యాటక జట్టు న్యూజిలాండ్‌ను బెంబేలెత్తించాడు. దీంతో 259 పరుగులకే కివీస్ ఆలౌట్ అయింది. కాగా ఈ ఇన్నింగ్స్‌లో ఏకంగా 7 వికెట్లు తీసిన ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (WTC) చరిత్ర సృష్టించాడు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) చరిత్రలో సుందర్ న్యూజిలాండ్‌పై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన బౌలర్‌గా అవతరించాడు. డబ్ల్యూటీసీ 2019లో ప్రారంభమవగా కివీస్‌పై 7 వికెట్లు తీసిన ఏకైక బౌలర్ సుందర్ కావడం విశేషం.

# సైలెంట్ మోడ్‌లో అనుష్కా శెట్టి ఘాటి షూటింగ్..!




మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి తర్వాత టాలీవుడ్ భామ అనుష్కా శెట్టి కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా చిత్రం ఘాటి సోషల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతానికి మీడియాకు దూరంగా ఉన్న స్వీటీ కొంతకాలంగా హైదరాబాద్‌లో మాత్రం కనిపించడం లేదు.

కాగా అనుష్కా శెట్టి మాత్రం సైలెంట్‌గా ఘాటి షూటింగ్ పూర్తి చేసిందని ఫిలిం నగర్ సర్కిల్‌లో ఓ వార్త రౌండప్ చేస్తోంది. క్రిష్ టీం ఇటీవల ఒడిశాలోని కోరాపుట్ జిల్లా అనకడేలి, లంటపుట్, మచకుంద్ ప్రాంతాల్లో ఘాటి చిత్రీకరణ జరిపిందట. మరి దీనిపై మేకర్స్ నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి. బోల్డ్-ఇంటెన్స్ పాత్రతో సాగే ఫీ మేల్ ఓరియెంటెడ్ కథాంశంతో ఘాటి తెరకెక్కుతోంది. వేదం సినిమా తర్వాత క్రిష్, అనుష్క కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

ముంబైలో జరిగిన అమెజాన్ ప్రైమ్ ఈవెంట్‌లో ఘాటి ప్రీ లుక్ లాంచ్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. నేరస్థురాలిగా మారిన బాధితురాలు తన ప్రతీకారాన్ని ఎలా తీర్చుకుందనే నేపథ్యంలో సినిమా సాగనుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.

ఘాటి అమెజాన్ ప్రైమ్ వీడియోలో పోస్ట్ థియాట్రికల్ రిలీజ్ కానుంది. అనుష్కా శెట్టి ప్రస్తుతం రొజిన్ థామస్ డైరెక్ట్ చేస్తున్న సినిమాతో మాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది.

# పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాంకు శివకార్తికేయన్ అమరన్ స్ట్రీమింగ్ రైట్స్

కోలీవుడ్ స్టార్ యాక్టర్ శివకార్తికేయన్ నటిస్తోన్న తాజా చిత్రాల్లో ఒకటి అమరన్ మేజర్ ముకుంద్ జీవితంలోని పలు కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కుతున్న ఈ సినిమాలో శివకార్తికేయన్ మేజర్ ముకుంద్ పాత్రలో నటిస్తున్నాడు. సాయిపల్లవి మేజర్ ముకుంద్ సతీమణి ఇందు రెబెకా వర్గీస్ పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రం అక్టోబర్ 31న తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవలే విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. కాగా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందించారు మేకర్స్. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్ ఫ్లిక్స్ స్ట్రీమింగ్ రైట్స్‌ను కొనుగోలు చేసింది. భారీ మొత్తానికి స్ట్రీమింగ్ రైట్స్‌ను కొనుగోలు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. SK21గా వస్తున్న ఈ మూవీకి రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే అమరన్ నుంచి జీవీ ప్రకాశ్ కుమార్ కంపోజిషన్ చేసిన హే రంగులే సాంగ్‌తోపాటు పాటలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో విశ్వరూపం ఫేం రాహుల్ బోస్ విలన్‌గా నటిస్తున్నాడు.

# మూసీపై ముందుకే.. ఈ ప్రాజెక్టుతో మరో నగరాన్ని సృష్టిస్తాం

- తొలి దశలో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి
- బెంగళూరు జిందాల్ తరహాలో ప్రకృతి చికిత్స కేంద్రం
- వినోదానికి లండన్ ఐ తరహాలో భారీ జెయింట్ వీల్
- ఇక్కడ గజం 10 వేలు ఉంటే 5 లక్షలు కూడా కావచ్చు
- ఆరున్నర ఏళ్లలో మొత్తం ప్రాజెక్టు అభివృద్ధి
- రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గడానికి హైడ్రా కారణం కాదు
- రాజకీయంగా కోరుకునేదేం లేదు.. తిరిగివ్వడమే..
- కేటీఆర్‌తోనే కేసీఆర్ రాజకీయానికి ముగింపు
- బాపూ ఘాట్ వద్ద అతి పెద్ద గాంధీ విగ్రహం
- స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ ఆఫ్ క్యాంపస్ సెంటర్ ఏర్పాటు
- చెక్ డ్యాం కమ్ వంతెన.. 30 కిలోమీటర్ల రింగ్
- ప్రాజెక్టుపై ప్రజలకు 45 రోజుల్లో ప్రజంటేషన్
- అభివృద్ధి కోసం నిద్రలేని రాత్రులు గడుపుతూ కృషి
- ఎంపికైన గ్రూప్-1 అభ్యర్థుల్లో 52% బీసీలే.. ఓసీలు 9%
- విలేకరులతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, : "మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముందుకే వెళతాం. దశలవారీగా చేపడతాం. ఈ ప్రాజెక్టుతో ఇంకో నగరాన్నే సృష్టిస్తాం. మిగతా నగరమంతా పగలు నడిస్తే.. మూసీ ఒడ్డున నిర్మించే నగరం మాత్రం రాత్రి నడుస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మొత్తం ప్రాజెక్టును ఆరున్నరేళ్లలో పూర్తి చేస్తామన్నారు. మూసీ ప్రాజెక్టు ప్రణాళిక వచ్చిన తర్వాత వికారాబాద్ నుంచి వాడపల్లి (మూసీ నది కృష్ణా నదిలో కలిసే చోటు) వరకు తాను పాదయాత్రకు సిద్ధమని, కేటీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్ సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తొలి దశలో.. మూసీ, ఈసీ నదులు కలిసే బాపూఘాట్ సంగమం వరకూ ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తామన్నారు.

"మూసీ నది గండిపేట నుంచి 11.5 కిలోమీటర్లు, ఈసీ నది హిమాయత్ సాగర్ నుంచి 9.5 కిలోమీటర్లు ప్రవహించి బాపూఘాట్ వద్ద కలుస్తాయి. తొలి దశలో ఆ ప్రాంతాన్ని ప్రక్షాళన చేస్తాం. బాపూజీ సిద్ధాంతం, ఆరోగ్యం, విద్య, వినోదం.. ఈ నాలుగు అంశాల థీమ్‌తో బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తాం. ఇక్కడ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేస్తాం. గాంధీ ఐడియాలజీ కేంద్రాన్ని నిర్మిస్తాం. బెంగళూరులోని జిందాల్ ప్రకృతి ఆశ్రమం తరహాలో ఇక్కడ కూడా ప్రకృతి చికిత్స ఆశ్రమం నిర్మిస్తాం.

స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలకు చెందిన ఆఫ్ క్యాంపస్ సెంటర్‌ను ఇక్కడ ప్రారంభిస్తాం. ఇక, వినోదం కోసం లండన్‌లో థేమ్స్ నది ఒడ్డున ఉన్న 'లండన్ ఐ' వంటి

భారీ జెయింట్ వీల్‌ను ఏర్పాటు చేస్తాం. బాపూఘాట్ వద్ద చెక్‌డ్యాం కమ్ వంతెన నిర్మిస్తాం. అక్కడి నుంచి కిందకు మూసీలోకి వదిలే నీరు స్వచ్ఛంగా ఉండేలా చూస్తాం. 30 కిలోమీటర్ల మేర రింగ్‌ను అభివృద్ధి చేస్తాం" అని వివరించారు. పర్యావరణ హిత థీమ్ పార్క్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి రోజు లక్ష మంది సందర్శించేలా పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మల్లన్న సాగర్ నుంచి గండిపేటకు.. అక్కడి నుంచి హిమాయత్ సాగర్‌కు గోదావరి నీటిని తరలించేందుకు ట్రంక్ లైన్ నిర్మాణం కోసం నవంబరు మొదటి వారంలో టెండర్లను పిలుస్తామన్నారు. బాపూఘాట్ పైభాగంలో వచ్చి కలిసే నీటిని శుద్ధి చేసేందుకు అవసరమైన ఎస్‌టీపీల నిర్మాణానికి టెండర్లు పిలుస్తామన్నారు.

**ప్రణాళికే పెట్టుబడి.. డబ్బులు ప్రైవేటువే** మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "ఈ అభివృద్ధి ప్రణాళికే మా పెట్టుబడి. దీన్ని తయారు చేశాక 10 దేశాల్లో రోడ్ షోలు నిర్వహించి ప్రదర్శిస్తాం. పెట్టుబడిదారులు వస్తారు. పెట్టుబడి అంతా ప్రైవేటు కంపెనీలదే. ఈ ప్రణాళిక అంతా అమలైతే మూసీ నది ఒడ్డున మాకో అపార్ట్‌మెంట్ ఉందని చెప్పుకునే పరిస్థితి వస్తుంది. రూ.10 వేలు ఉన్న గజం ధర.. రూ.5 లక్షలు కూడా కావొచ్చు" అని వ్యాఖ్యానించారు. గండిపేటలో కూల్చిన ఫామ్‌హౌసలు బలిసినోళ్లవని, వాళ్ల డ్రెయిన్ నీళ్లు గండిపేటలో కలిపితే కింద ఉన్నవాళ్లు తాగాల్సి వస్తోందని, అందుకే నిర్దాక్షిణ్యంగా కూల్చేశామని తేల్చి చెప్పారు. కానీ, మూసీ నిర్వాసితుల విషయంలో అలా కాదని, డబుల్ బెడ్ రూం ఇల్లు, పరిహారం తీసుకోవడానికి అంగీకరించిన వారివే తొలగిస్తున్నామని, నిర్వాసితులకు వీలైనంత మేర న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

**ఇంకో హైదరాబాద్ అంత వ్యాపారం.. బాధితులకూ భాగస్వామ్యం** "మూసీ నదిని అభివృద్ధి చేయాలని నాకు ఏ దేవుడూ చెప్పలేదు. నేనూ హామీ ఇవ్వలేదు. కానీ, రాష్ట్ర ఆదాయంలో 55 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. మూసీ అభివృద్ధి చేస్తే నగర ఆదాయం మరింత పెరుగుతుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రణాళిక రూపకల్పన కోసం ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఐదు సంస్థల కన్సార్షియంకు బాధ్యతలు అప్పగించామని, 45 రోజుల్లో ప్రాథమిక్షంగా 18 నెలల్లో సమగ్ర ప్రణాళికను అందిస్తారని తెలిపారు. దానిపై ప్రభుత్వం ప్రజలకు ప్రజంటేషన్ ఇస్తుందని వెల్లడించారు. "మూసీ ఒడ్డున ఉన్నది చిన్న వ్యాపారులు. చిరుద్యోగులే. వారిని కూడా అభివృద్ధిలో భాగస్వాములను చేస్తాం. స్వయం సహాయక బృందాల తరహాలో నిర్వాసితులను గ్రూప్‌లుగా ఏర్పాటు చేస్తాం. వారికి కొన్ని షాపులను కేటాయిస్తాం. ప్రాజెక్టు పూర్తయ్యాక వ్యాపారానికి ఇంకో సైకిల్ అదనంగా కలుస్తుంది" అని రేవంత్ వివరించారు. ఇప్పుడు హైదరాబాద్‌లో పగలు వ్యాపారం జరుగుతోందని, మూసీ ఒడ్డున షాపింగ్, వినోదం, విహారం వంటివన్నీ రాత్రిళ్లు ఉంటాయని, ఇంకో హైదరాబాద్ అంత వ్యాపారం మూసీ ఒడ్డున రాత్రిపూట జరుగుతుందని చెప్పారు.

**కేటీఆర్ ఎందుకు వద్దంటున్నారో అర్థం కావట్లేదు** దుబాయ్‌ని ఒక కాన్సెప్టతో అభివృద్ధి చేశారని, ఇప్పుడు డబ్బులున్న వారంతా దేశ, విదేశాల నుంచి వెళ్లి, చూసి అక్కడ ఖర్చు చేస్తున్నారని, హైదరాబాద్‌లోనూ అలాగే జరుగుతుందని సీఎం రేవంత్ వెల్లడించారు. "కేటీఆర్ బావమరిదిలా అందరికీ ఫామ్‌హౌసలు, విలాసవంతమైన ఇళ్లు ఉండవు. సామాన్యులు కూడా తమ పిల్లల్ని తీసుకెళ్లి అక్కడ ఆనందించేలా అభివృద్ధి ఉంటుంది. ఒక వ్యక్తికి కావాల్సిన అన్ని వస్తువులూ షాపింగ్ చేసుకునేలా ఏర్పాటు చేస్తాం. పదేళ్లు అధికారంలో ఉండి అమెరికా, లండన్ తిరిగొచ్చిన కే టీఆర్ ఇక్కడ మూసీని, పేదలను అభివృద్ధి చేయవద్దని ఎలా అంటున్నారో అర్థం కావడం లేదు. ఇక్కడ జరిగేది ఏదైనా నా ఇంటికొస్తుందా? గతంలో ఒకాయన ఔటర్ రింగ్ రోడ్డు ఆలోచన చేస్తే.. ఇంకో ఆయన దాన్ని అమలు చేశారు. ఒకాయన ఐటీకి శంకుస్థాపన చేస్తే.. చంద్రబాబు దాన్ని అభివృద్ధి చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కొనసాగించారు. ఇప్పుడు ప్రతిపక్షానికి మాత్రం ఆ బాధ్యత ఎందుకు లేదో అర్థం కావడం లేదు" అని వ్యాఖ్యానించారు. ప్రణాళిక సిద్ధం కాకుండానే నిర్వాసితులను ఎందుకు ఖాళీ చేయిస్తున్నారని ప్రశ్నించగా.. ఎంత భూమి అందుబాటులోకి వస్తుందనేది తెలిస్తే కానీ ప్రణాళిక వేయలేరని, ఒకవేళ ప్రణాళిక వేసేశాక అక్కడ భూమి అందుబాటులోకి రాకుంటే మొత్తం ప్రాజెక్టుకే దెబ్బ తగులుతుందని వివరించారు. ప్రణాళిక తయారు చేస్తున్న సంస్థలు కూడా ఎంత భూమి ఇస్తారో చెప్తేనే.. కార్యాచరణ ప్రణాళిక చేయగలమని చెప్పాయని బదులిచ్చారు.

**రాజ్ పాకాల ఎందుకు పారిపోయారు?** "మాకు దీపావళి అంటే చిచ్చు బుడ్లు. వాళ్లకు సారా బుడ్లు. దీపావళి దావత్ అలా చేస్తారని మాకు తెలియదు" అని రాజ్ పాకాల ఫామ్ హౌస్ పార్టీపై సీఎం రేవంత్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అక్కడ విదేశీ మద్యం, క్యాసినో కాయిన్లు,

కొకైన్ తీసుకున్న వ్యక్తి, పేకలు అన్నీ ఉన్నాయని, ఏమీ చేయక పోతే రాజ్ పాకాల ఎందుకు పారిపోయాడని ప్రశ్నించారు.

**కేసీఆర్ చేసిన అప్పులకు బాకీలు మేం కడుతున్నాం** మూడు లక్షల కోట్లు అప్పు చేశామని కేసీఆర్ ప్రభుత్వం చెప్పిందని, కానీ, రూ.7.5 లక్షల కోట్లు అప్పు చేసినట్లు తేలిందని సీఎం రేవంత్ తెలిపారు. "పది నెలల్లో మేం చేసిన అప్పు రూ.49 వేల కోట్లు. కానీ. చెల్లించిన బాకీలు రూ.56 వేల కోట్లు. అంటే.. కేసీఆర్ చేసిన అప్పుల తాలూకు బాకీలను మేం కడుతున్నాం. మేం తెచ్చిన అప్పుల కంటే 7 వేల కోట్లు అధికంగా ఆ చెల్లింపులు చేశాం. అంతేకాదు.. కేసీఆర్ ప్రభుత్వం తరహాలో ఈ 10 నెలల్లో మేం హైదరాబాద్, రంగారెడ్డిల్లో భూములు అమ్మలేదు. కానీ, రూ.17,800 కోట్ల రుణ మాఫీ చేశాం. 200 యూనిట్లలోపు విద్యుత్తును ఎంతమంది అర్హులుంటే అంతమందికీ ఉచితంగా ఇస్తున్నాం. రూ.500లకే సిలిండర్ అందిస్తున్నాం. ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఉద్యోగులకు జీతాలు, పించన్లు నెల మొదట్లోనే ఇస్తున్నాం. మద్యం సరఫరాదారులకు కేసీఆర్ రూ.4 వేల కోట్ల బకాయిలు పెడితే క్లియర్ చేస్తున్నాం. కాంట్రాక్టర్లకు రూ.52 వేల కోట్ల బిల్లులు బకాయి పెడితే.. అందులో ఇప్పటికే రూ.10 వేల కోట్లు చెల్లించాం" అని సంక్షేమ హామీలు ఇంకా అమలు చేయాల్సి ఉంది కదా అన్న ప్రశ్నకు సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. నిద్ర లేని రాత్రులు గడుపుతూ ఆర్థిక పరిస్థితిని సమన్వయం చేసుకుంటున్నామని, మిగతా హామీలను కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

**రియల్ ఎస్టేట్ దేశమంతా పడింది..** హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ ఆదాయం పడిపోయిందని, హైడ్రానే ఇందుకు కారణమని అంటున్నారని, కానీ, హైడ్రా లేని వరంగల్‌లోనూ రిజిస్ట్రేషన్ల ఆదాయం పడిపోయిందని సీఎం రేవంత్ తెలిపారు. రియల్ ఎస్టేట్ దేశమంతా పడిపోయిందని, ఆర్థిక మాంద్యమే దీనికి కారణమని తెలిపారు.

"రాంగోపాల్ వర్మ సినిమా రిలీజ్‌కు ముందు హడావుడి ఎక్కువ ఉంటుంది. సినిమా బాగుంటుందా? లేదా? అన్నది తర్వాతి సంగతి. అదే రాజమౌళి సినిమాకు రిలీజ్‌కు ముందు హడావుడి తక్కువ ఉంటుంది. ఎవరి దారి వారిదే. కేటీఆర్‌లా రేవంత్ రెడ్డి ఉండాలంటే ఎలా?" అని ఓ ప్రశ్నకు జవాబుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, ఈ ఆటలో ప్రతి ఆటగాడు ప్రత్యర్థి జట్టులోని మరో ఆటగాడిని మ్యాపింగ్ చేస్తాడని, అతడిని అలిసిపోయే దాకా పరిగెత్తించి అప్పుడు గోల్ వైపు బంతిని తీసుకెళతాడని, కేటీఆర్, హరీశ్, ఈటల కూడా అలానే అలసిపోతారని చెప్పారు.

**కేటీఆర్‌తోనే కేసీఆర్ రాజకీయం ముగింపు** మూసీ నది ప్రక్షాళన వ్యవహారంలో మీరు కేసీఆర్‌ను వదిలేసి కేటీఆర్‌నే విమర్శిస్తున్నారు. ఆ మేరకు కేటీఆర్ సక్సెస్ అయినట్లేనా? అని ప్రశ్నించగా.. "కేసీఆర్ ఎక్స్‌పైరీ మెడిసిన్. ఎన్నికల ముందే ఇది చెప్పాను. కేసీఆర్‌ను మరిపించేందుకే ఇప్పుడు కేటీఆర్‌ను ప్రస్తావిస్తున్నాం. కేటీఆర్‌తోనే కేసీఆర్ రాజకీయం ముగుస్తుంది. ఆ తర్వాత బావతో బామ్మర్ది రాజకీయం ముగుస్తుంది. ఇక బావను ఎలా హ్యాండిల్ చేయాలో మాకు తెలుసు" అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దీపావళిలోపే బాంబులు పేలతాయని పొంగులేటి అన్నారుగా అని ప్రశ్నించగా.. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ విచారణలు కొనసాగుతున్నాయని, చట్టప్రకారమే చర్యలు ఉంటాయని తెలిపారు.

**హైదరాబాద్ మారవద్దా !** ? కేటీఆర్ ఇటీవల మూసీ నిర్వాసిత చిన్నారి ఒకరిని కలిశాడని, ఆమెకు ఒక ఇల్లు ఇస్తారేమోనని అనుకున్నానని, కానీ, నీళ్ల సీసా మాత్రం ఇచ్చాడని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. "మూసీని ఇలానే వదిలేస్తే మూసుకుపోతుంది. మూసీ మూసుకుపోతే హైదరాబాద్ నగరానికే పెనుప్రమాదం. కేటీఆర్, కేసీఆర్ తాతలు గోచీ పెట్టుకుని ఉండేవాళ్లు. కానీ, కేసీఆర్, కేటీఆర్ పరివర్తన చెంది సూట్‌లు వేసుకునే వరకూ వచ్చారు. మరి హైదరాబాద్ మాత్రం పరివర్తన చెందొద్దా?" అని రేవంత్ ప్రశ్నించారు.

**గ్రూప్ 1కు ఎంపికైన అభ్యర్థుల్లో 52% బీసీలే** గ్రూప్-1 పరీక్షల విషయంలో ప్రతిపక్షాలు ఆందోళన చేశాయని, కానీ, పరీక్ష అయ్యాక టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పెట్టిన వివరాల ప్రకారం ఎంపికైన అభ్యర్థుల్లో 52 శాతం బీసీలే ఉన్నారని సీఎం రేవంత్ వివరించారు. ఓసీలు 9 శాతం మంది మాత్రమే ఉన్నారని తేలిందన్నారు.

**తిరిగి ఇవ్వడమే ఇక మిగిలింది** ప్రజలు రాజకీయంగా తనకు ఇవ్వాల్సింది ఇచ్చేశారని, ఇక ఇంతకంటే కోరుకునేది ఏమీ లేదని, ప్రజలకు తిరిగి చేయడమే మిగిలిందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. "నేను కోరుకోవడానికి ఇక ఏమీ లేదు. ప్రజలకు చేయడమే మిగిలింది. నా వయసు, ఓపిక, శక్తి అన్నీ ప్రజలకు తిరిగి చేసేందుకే ఉపయోగిస్తా" అని చెప్పారు. మరోవైపు, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్నారు.

# పారదర్శకంగా కుల గణన చేస్తాం
## : మహేశ్ కుమార్ గౌడ్




హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుల గణన విషయంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

వారి ప్రయత్నానికి కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. బుధవారం గాంధీభవన్ లో నిర్వహించిన సమావేశంలో మహేశ్ మాట్లాడుతూ.. నవంబర్ 2న 33 జిల్లాల్లో కులగణనపై డీసీసీ అధ్యక్షుల సమావేశాలు ఏర్పాటు చేసి ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణనపై తలెత్తే అనుమానాలపై గాంధీభవన్ లో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సమాచారం ఇస్తామని చెప్పారు. కులగణన కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

కుల గణన కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలవబోతుందని దీనిని అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీ సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ కుల గణనపై స్పష్టమైన ప్రకటన చేశారని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సైతం కులగణన చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. అందుకు అనుగుణంగా కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. నిష్పక్షపాతంగా సమగ్ర కులగణన చేపడతామని, అన్ని వర్గాలను ఇందులో భాగస్వామ్యం చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

**కులగణనకు సహకరించాలి..** దేశంలో తొలిసారి సమగ్ర కుల సర్వే జరిపేందుకు అన్ని ఏర్పాటు సిద్ధమయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 6 నుంచి కులగణన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాన్ని శాసనసభలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. సర్వేకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. సమగ్ర సర్వే సరిగ్గా జరిగేలా అందరూ సహకరించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన ప్రకారం అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు.. సర్వేలో పాల్గొని అధికారులకు సహకరించాలని చెప్పారు. అధికారులకు ఇబ్బందులు లేకుండా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు.

# రాష్ట్రంలో మట్టి రోడ్డు లేకుండా చేస్తాం

## రూ.12 వేల కోట్లతో 17 వేల కి.మీ. రోడ్ల నిర్మాణం

## రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నల్లగొండ, : రాష్ట్రంలో ఎక్కడా మట్టి రోడ్డు లేకుండా చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. గ్రామాల్లో పంచాయతీరాజ్, ఆర్అండ్బీ శాఖల ద్వారా త్వరలో రూ.12 వేల కోట్ల వ్యయంతో 17 వేల కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించనున్నట్లు తెలిపారు. మంగళవారం మంత్రి నల్లగొండ జిల్లాలోని పగిడిమర్రి, ముషంపల్లిలో రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారుల విస్తరణలో భాగంగా రూ.30 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని వెల్లడించారు. బీఆర్ఎస్ నేతలు పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. దీపావళి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తామని, ప్రతి నియోజక వర్గంలో 3,500 మంది నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఎస్ఎల్బీసీ సొరంగమార్గం ప్రాజెక్టు పూర్తిచేసేందుకు రూ.4,600 కోట్ల అంచనా వ్యయం నిర్ధారించామని, సొరంగ పనుల యంత్రాల్లో మరమ్మతులకు గురైన బేరింగ్ని అమెరికా నుంచి తెప్పిస్తున్నామని చెప్పారు. రెండేళ్లలో సొరంగ మార్గం పూర్తిచేసి రైతాంగానికి నీరందిస్తామని హామీ ఇచ్చారు.

# హామీలు అమలు చేసేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతాం

## బావ, బావమరుదులు రేవంత్‌రెడ్డికి సహకరిస్తున్నారు

## బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తాం: బండి సంజయ్



విశాఖపట్నం, : తెలంగాణలో కాంగ్రెస్ ఆరు హామీలను అమలు చేసేంత వరకు ఆ ప్రభుత్వాన్ని వెంటా డుతూనే ఉంటామని బీజేపీ నాయకులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రోజ్‌గార్ మేళాలో పాల్గొనడానికి విశాఖపట్నం వచ్చిన ఆయన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణాలో బావ, బావమరుదులు ఇద్దరూ పోటీ పడి సీఎం రేవంత్‌రెడ్డికి సహకరిస్తున్నారని ఆరోపించారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్ ఘటనను నీరుగార్చిందని విమర్శించారు. బూతులు తిట్టేటోడు నోటీసులు ఇస్తే విలువ ఏముంది?... అని ప్రశ్నించారు. నోటీసులకు బదులు ఇచ్చానని, తాను కూడా తిరిగి నోటీసులు ఇస్తానన్నారు. తెలంగాణాలో బీఆర్ఎసను నామరూపాల్లేకుండా భూస్థాపితం చేస్తామన్నారు.


# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## మంత్రి పొంగులేటి




తిరుమలాయపాలెం, : రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పథకానికి శ్రీకారం చుడతామని చెప్పారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు, గోల్‌తండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి విడతగా ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విడతలవారీగా అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి సంక్షేమథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

# డిస్మిస్ చేసిన పోలీసులను విధుల్లో చేర్చుకోండి: కూనంనేని



హైదరాబాద్, : ప్రత్యేక పోలీసు కానిస్టేబుళ్లకు మట్టి పనులు చెప్పడం, అనధికారికంగా ఆర్డర్లీ సేవలకు వినియోగించడం వంటి విధా నాలకు స్వస్తి పలకాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీజీఎస్పీ పోలీసులు చేస్తున్న ఆందోళనలను మానవతా ధృక్పథంతో అర్థం చేసుకొని డిస్మిస్ చేసిన 10 మందిని, సస్పెండ్ చేసిన 37 మందిని విధుల్లోకి తీసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. సివిల్ పోలీసుల మాదిరిగానే ఒకే రాష్ట్రం ఒకే పోలీసు విధానం అమలు చేయాలన్న ప్రత్యేక పోలీసు సిబ్బంది డిమాండ్లను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలను పట్టించుకోకపోవడంతోనే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు.

# టెస్కో ద్వారానే వస్త్రాలు కొనాలి

## అన్ని ప్రభుత్వ శాఖలకు ఇది తప్పనిసరి: తుమ్మల



హైదరాబాద్, : రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు అన్ని కూడా టెస్కో ద్వారానే వస్త్రాలు కొనుగోలు చేయాలని చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. నవంబరు 15 లోగా వస్త్రాల కోసం ఇండెంట్ టెస్కోకు సమర్పించాలని వివిధ సంక్షేమ శా ఖల అధికారులను ఆదేశించారు.

సచివాలయంలో టెస్కోకు వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జీవో నెం.1 తీసుకొచ్చిందన్నారు. దీని ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమయ్యే వస్త్రాన్ని తప్పనిసరిగా టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలని చెప్పారు. జీవోకు విరుద్ధంగా ఎవరైనా ప్రైవేట్ సంస్థల నుంచి వస్త్రాలు కొంటే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కొన్ని సంక్షేమ శాఖలు ప్రతి సంవత్సరం యూనిఫాం రంగులు మార్చడం వల్ల సరఫరాలో ఆలస్యం జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, కాబట్టి కనీసం ఐదేళ్ల డిజైన్ మార్చకుండా ఉంచాలని సూచించారు..

# రూ.1500 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, : రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.1500 కోట్ల అప్పు తీసుకొంది. రిజర్వ్ బ్యాంక్ మంగళవారం నిర్వహించిన ఈ-వేలంలో పాల్గొని ఈ రుణాన్ని సేకరించింది. 23 ఏళ్ల కాల పరిమితి, 7.16 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 25 ఏళ్ల కాల పరిమితి, 7.16 శాతం వార్షిక వడ్డీతో రూ.500 కోట్ల అప్పు తీసుకొంది. తెలంగాణతో కలిపి దేశంలోని 10 రాష్ట్రాలు మొత్తం రూ.25,050 కోట్ల అప్పులు తీసుకున్నాయి.



# కాంగ్రెస్ సర్కార్‌పై ఎంపీ రఘునందన్ ఫైర్



హైదరాబాద్, : రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గ్రామాలు బాగుండాలని కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆరునెలల క్రితం 1200 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గ్రామాల్లో పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని.. కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన నిధులు దారి మళ్లించారని మండిపడ్డారు. ఆ బిల్లులు ఇవ్వకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.600 కోట్లు పెండింగ్‌లో పడ్డాయన్నారు. పల్లె ప్రగతి నిధులు విడుదల చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో పంచాయతీ సెక్రటరీలు కూడా సొంత డబ్బుతో పనులు చేయించారన్నారు.

**నిధులు కావాలి.. పేరు మాత్రం చెప్పరు** : కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెకమండేషన్ మేరకు రూ.500 కోట్లు విడుదల చేసిందని.. నేషనల్ హెల్త్ మిషన్ కోసం 300 కోట్ల రూపాయలు విడుదల చేసిందని చెప్పారు. 5 - 6 వందల మందికి ఒక హెల్త్ సెంటర్ నిర్మాణం చేయాలని చెప్పిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో గ్రామాలలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలు విడుదల చేసినా తెలంగాణ సర్కార్ వాటిని దారి మళ్లించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కావాలి కానీ కేంద్రం పేరు చెప్పేందుకు మనసు రాదంటూ మండిపడ్డారు. నియోజకవర్గానికి 3,500 ఇల్లు కట్టిస్తామని చెప్పిందని.. వాటిని కట్టేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని.. ఆ నిధులను కూడా అర్బన్ మిషన్ కింద సేకరిస్తోందన్నారు. వాటిని ఎవరు పంచాలనేది దానిపై కొట్లాట మొదలైందన్నారు. కలెక్టర్‌లతో కాకుండా గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల చేతుల మీదుగా ఆ నిధులు అందజేస్తామని చెబుతున్నారన్నారు.

**బాంబు పేలుస్తారో చూస్తాం** మునిసిపాలిటీలలో 250 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం విడుదల చేసిందన్నారు. "మా పైసలు తీసుకుని మా భాగస్వామ్యం లేకుండా ఇళ్లను పంచిపెడితే కచ్చితంగా అడ్డుకుంటాం. ఇందిరమ్మ కమిటీలు చెల్లుబాటు కావు. ప్రతి స్కీంకు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేర్లు పెట్టే భావదారిద్ర్యం ఉంది. మూసీ శుద్ధి, సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు .

అభివృద్ధి పేరుతో కార్పోరేట్ కంపెనీలకు పనులు అప్పజెబితే మాత్రం వ్యతిరేకిస్తాం. మూసీకి కొండ పోచమ్మ సాగర్ నుంచి నీరు తెస్తే 1500 కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. మల్లన్న సాగర్ నుంచి నీరు తెస్తే 7వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. పేదోళ్లు కట్టిన ఇంటి వద్ద 50 మీటర్ల దూరం అభివృద్ధి చేస్తాం అంటున్నారు. మూసీ అభివృద్ధిలో క్విడ్ ప్రోక్రో ఉన్నట్లు అనుమానం ఉంది. ప్రజలు బీఆర్ఎస్‌కు సీఆర్ఎస్ ఇచ్చారు.. వారిని ఫాం హౌస్‌లకు పరిమితం చేశారు. పేదోళ్లకు కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఇస్తుంది. కుక్కతోక పటాకులు పేలుస్తారా .. సుతీల్ బాంబు పేలుస్తారా చూడాలి. అదిపేలుస్తాం ఇది పేలుస్తాం అని బ్రేకింగ్ ప్లేట్ల కోసం మాట్లాడకుండా అవినీతిపరులను అరెస్టు చేస్తే మేం స్వాగతిస్తాం" అని ఎంపీ రఘునందర్ రావు వెల్లడించారు.